

వివరాలు 6లో

## రైస్ మిల్ సీజ్ చేసిన అధికారులు


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ గురువారం | 27 మార్చి 2025 | ■ 11 పేజీలు




10

# ఐపీఎల్ హోరు బెట్టింగ్ జోరు

■ జోరుగా ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు ■ రెండింతల డబ్బు ఆశ చూపుతున్న బుకీలు ■ ఆన్‌లైన్‌లోనూ జోరుగా పందేలు.. ■ ఫోన్లలో కోడ్ భాష ■ బానిసలవుతున్న యువత, వ్యాపారులు

క్రికెట్ ప్రియులను ఉర్రూతలూగించే ఐపీఎల్ సీజన్ కొనసాగుతోంది.. క్రీడాకారులు ఆకాశమే హద్దుగా సిక్సులు, ఫోర్లతో ఆద్యంతం అభిమానులను ఆనందంలో ముంచెత్తుతున్నారు. అయితే బుకీలు మాత్రం క్రికెట్ ప్రేమికులను ప్రలోభపెట్టే పనిలో ఉన్నారు. క్రీడా స్ఫూర్తిని నింపాల్సిన క్రికెట్‌ను యువత జూదంగా చూస్తోంది.. బెట్టింగ్ ఉచ్చులోకి వారిని దించుతున్నారు. బంతి.. బంతికీ వేల నుంచి లక్షల రూపాయల్లో బెట్టింగ్ కడుతున్నారు.. ఒకటికి రెండింతలు డబ్బులిస్తామని ఆశలు కల్పిస్తూ వారిని అప్పుల ఊబిలోకి నెడుతున్నారు పందెంరాయుళ్లు.. డబ్బులేక వారి వద్ద ఉన్న బైకులు, బంగారాన్ని తాకట్టు పెడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ వ్యవహారం బాహాటంగానే సాగుతుంది. ఆన్‌లైన్, నెట్‌లు, స్మార్ట్ ఫోన్ల ద్వారా దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఎస్ఎంఎస్‌లు, సీక్రెట్ కోడ్‌ల ద్వారా ఏజెంట్లు బెట్టింగ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

## స్త్రీ నిధిలో బెస్ట్.. ఉమ్మడి జిల్లాకు
# రాష్ట్ర స్థాయి పురస్కారాలు

■ స్త్రీనిధి రుణాల రికవరీలో ఆర్శంగా నిలిచిన నిర్మల్ జిల్లా

■ వరుసగా నాలుగోసారి అవార్డు కైవసం..

■ కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకూ పురస్కారాలు

స్త్రీనిధిలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచింది. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా రాష్ట్ర స్థాయిలో వరుసగా అవార్డులను కైవసం చేసుకుంటోంది. తాజాగా ఈ సంవత్సరం కూడా ఆ ఘనతను నిలుపుకుంది. బుధవారం స్త్రీనిధి 12వ సర్వసభ్య సమావేశంలో నిర్మల్ డీఆర్డీఓ తరపున జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, కుమ్రంభీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మందమర్రి మెప్మా టీఎంసీ రఘురాం, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు మౌనిక, అసిస్టెంట్ మేనేజర్ మమత అవార్డు అందుకున్నారు.



11

## మండు వేసవిలో..
# ఫలహారం

భానుడు భగ్గుమంటున్నాడు.. రోజు రోజుకూ ఎండ తీవ్రత అధికమవుతోంది.. ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు.. కానీ వెళ్లక తప్పదు.. దీంతో ఎండదెబ్బ తగిలి నీరసపడడం.. వడదెబ్బ తగలడం.. వాంతులు, విరేచనాలు సోకుతాయి.. దీనివల్ల శరీరంలోని లవణాలు కోల్పోయి అస్వస్థతకు గురవుతారు.. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు ఘనాహారం కంటే పండ్లు, పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల వేసవి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. పండ్లలో మాంసకృతులు, పిండి పదార్థాలు విటమిన్లు మాత్రమే కాక కాల్షియం, మెగ్నీషియం, సోడియం, పొటాషియం, ఇనుములాంటి పోషకాలు ఉంటాయి.. వేసవి కాలంలో లభించే పండ్లు వాటిలో ఉండే పోషక విలువల గురించి ప్రత్యేక కథనం.



# పండుగలు మతసామరస్యానికి ప్రతీకలు

■ మతాలకతీతంగా పండుగలు జరుపుకోవాలి ■ ఇఫ్తార్ విందులో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

■ ఇఫ్తార్ విందులో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

అన్ని కులమతాలకు ప్రత్యేకంగా నిలిచే మన దేశంలో అన్ని పండుగలు మతాలకతీతంగా జరుపుకోవాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం మైనార్టీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో స్థానిక రాయల్ పాలేస్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో ప్రతి ఒక్కరూ అన్ని మతాలను కులాలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మల్ జిల్లాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆదిలాబాద్ గాంధీపార్క్ టెండర్ రూ.37.39లక్షలు -11లో

# అభివృద్ధికి నోచుకోని కేవీకే

రైతులకు మెరుగైన సేవలు, ఆధునిక సాంకేతికతను చేరువ చేయడంతో పాటు వివిధ అంశాల్లో మెరుగైనసేవలు అం దించాలనే సంకల్పంతో మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల రైతుల కోసం ఏర్పాటైన కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) అభివృద్ధికి నోచుకోవడం లేదు. బెల్లంపల్లిలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రారంభమైన ఏడేళ్ల నుంచి అభివృద్ధి కోసం నిధులు రావడం లేదు. దీంతో కేవీకే ఆవరణలో సాగుచేసిన పంటలకు రక్షణ కోసం ఫెన్సింగ్, ప్రహరీ లేకపో వడంతో పంటలు పశువులపాలవుతున్నాయి.



7లో



# జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

- అక్రమ కట్టడాలపై పంచాయతీ, మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలి
- అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి
- దరఖాస్తుల ప్రక్రియపై సమీక్షించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలి
- వివిధ శాఖ అధికారుల సమీక్షా సమావేశంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో భూ సంబంధిత సమస్యల పరిష్కారం కొరకు జిల్లా, సబ్-డివిజన్, మండల స్థాయిలలో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్‌తో కలిసి మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు, బెల్లంపల్లి, జైపూర్ ఎ.సి.పి.లు, తహశిల్దార్లు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యల పరిష్కారం కొరకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి కమిటీలో తహశిల్దార్, ఎస్.హెచ్.ఓ.ల పరిధిలో నివాస ప్రాంతాలు, నిర్మాణ అనుమతులు, సరైన అనుమతులు లేని అక్రమ కట్టడాలపై ప్రత్యేక అధికారులైన మండల పంచాయతీ అధికారి, మున్సిపల్ కమీషనర్ల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించి రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేసి గ్రీవెన్స్ నంబర్ కేటాయించాలని, దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారించాలని, కనీసం 15 రోజులు, గరిష్టంగా 21 రోజులలోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. కోర్టులో పరిష్కారమయ్యే సమస్యలపై సంబంధిత అర్జీదారులకు అవగాహన కల్పించి తగు సూచనలు చేయాలని తెలిపారు. సబ్-డివిజన్ స్థాయిలో రాజస్వ మండల అధికారి, ఎ.సి.పి.ల పరిధిలో మండల స్థాయి కమిటీ పనితీరును 15 రోజులకు ఒకసారి పరిశీలించి సమస్యల పరిష్కారంలో మండల కమిటీకి తగిన సూచనలు చేయాలని, డివిజన్ స్థాయిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత మండల స్థాయి కమిటీకి సిఫారసు చేసి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్, డి.సి.పి.ల పరిధిలో మండల, సబ్-డివిజన్ స్థాయి దరఖాస్తుల ప్రక్రియపై సమీక్షించి దరఖాస్తుల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను కమిటీల ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మండల, సబ్-డివిజన్ కమిటీల వారిగా వచ్చిన దరఖాస్తులు, తీసుకున్న చర్యలపై సమీక్షించారు. 20-30 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం అవుతు న్నా యని, వయోవృద్ధుల సంబంధిత దరఖాస్తులు అధికంగా వస్తున్నాయని, ఒంటరి మహిళ, దివ్యాంగుల సంబంధిత దర ఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. డి.సి.పి మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి, రెవె న్యూ సంబంధించిన భూసమస్యలపై ప్రత్యేక చర్యలు తీసుకో వాలని, సింగరేణి అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు.





## వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు

**జన్నారం, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లో ఉన్న అభయారణ్యంలోని వన్యప్రాణులకు నీటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఇందనపల్లి ఎస్ఆర్ఓ కారం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని రాయికుంట, బర్తన్‌పేట్, తదితర ప్రాంతాల్లో సోలార్ సిస్టంలతో నడిచే బోర్లను పరిశీలించారు. అభయారణ్యంలో విద్యుత్ సౌకర్యం ఉండదని, సౌర విద్యుత్తుతో పనిచేసే బోర్లను ఏర్పాటు చేసి నీటికొరత లేకుండా చూస్తున్నామన్నారు. ఎఫ్ఎస్ఓలు హనుమంతరావు, ముజీపుద్దీన్ పాల్గొన్నారు.

## మహిళా రైతులకు వ్యవసాయ పనిముట్లు

**జన్నారం, మార్చి 26 (ప్రభాత సమాచారం)**



జన్నారం మండలంలోని దేవునిగూడెం, సింగరా యపేట చింతాగూడ, కలమడుగు పొనకల్ క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉన్న మహిళా రైతులు ప్రభుత్వం సబ్సిడీపై అందించే వ్యవసాయ పనిముట్లు, యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని మహిళా రైతుల కోసం ప్రభుత్వం బ్యాటరీ, మాన్యువల్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్, రొటేటర్ లాంటి పరికరాలను సబ్సిడీపై మంజూరు చేసిందన్నారు. ఆసక్తిగల మహిళా రైతులు మార్చి 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇబ్బందులు రావద్దు







- ఇండ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలుపాటించాలి
- ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- అధికారులు, సిబ్బందికి సూచనలు చేసిన కలెక్టర్

**నిర్మల్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

బుధవారం సాయంత్రం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలించారు. హౌస్ డిజైన్, ప్రజలకు అందుబాటులో ఉండే సౌకర్యాలపై అధికారులకు కీలక సూచనలను చేసారు. నిర్మాణ నాణ్యతను మెరుగుపరచాలని, పనులను వేగంగా పూర్తి చేయాలని, లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇండ్లు లేని పేదవారికి ఇండ్లను అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. అన్ని మండలాల్లో నిర్మించ తలపెట్టిన నమూనా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారుల సర్వే కొనసాగుతోందని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎంపీ డివో కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ, పట్టణ పరిధిలో ఆస్తిపన్ను వసులును వందశాతం పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. ఎల్ ఆర్ ఎస్ కు ఈనెల 31 వరకు గడవు ఉన్నందున దస్తుదారులు 25 శాతం లబ్ధి పొందేలా ఎల్ఆర్ఎస్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వాగులు, నది పరివాహక ప్రాంతాలలో ఇసుక రీచ్‌లను గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీస్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో సునీత, ఎంపీఓ రత్నాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మతాలకతీతంగా పండుగలు జరుపుకోవాలి

**ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

అన్ని కులమతాలకు ప్రత్యేకంగా నిలిచే మన దేశంలో అన్ని పండుగలు మతాలకతీతంగా జరుపుకోవాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం మైనార్టీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో స్థానిక రాయల్ పాలేస్ సాత్నాలలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జిల్లా కలెక్టర్? రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, రెవెన్యూ డివిజనల్ అధికారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని కులాలకు మతాలకు భారతదేశం ఒక కేంద్ర బిందువుగా పిలవబడుతుందన్నారు. ఈ దేశంలో ప్రతి ఒక్కరూ అన్ని మతాలను కులాలను గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అధికారికంగా మైనార్టీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో



నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్న ముస్లింలు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## నిత్యావసర సరుకుల అందజేత

**జన్నారం, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని జువ్విగూడలో 27న బంజారీల అరధ్య దైవం సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టపన పురస్కరించుకొని పీసీఆర్ పౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం బస్తాలను సేవాలాల్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీఆర్ పౌండేషన్ వ్యవస్థపకులు ప్రవీణ్ కుమార్, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్ర శేఖర్, మాజీ కోఆప్షన్ సభ్యులు మున్వర్ ఆలీ ఖాన్ ఉన్నారు.






# మహిళా హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి

**మంచిర్యాల, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

నేటి సమాజంలో మహిళలు వారికి ఉన్న హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో భేటి బచావో - భేటి పడావో, జిల్లా మహిళా సాధికారత కేంద్రం, జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి మెంటల్ హెల్త్ అండ్ లీగల్ రైట్స్ అవగాహన కార్యక్రమనికి జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్గన్, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి డా? అనిత లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు తమకు ఉన్న హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నేటి సమాజంలో స్మార్ట్ ఫోన్ వాడకం పెరగడం వలన మానవ సంబంధాలు బలహీనపడుతున్నాయని, ఎక్కువ సమయాన్ని వృధా చేస్తూ సమస్య ఎదురైనప్పుడు ఎవరికి చెప్పుకోకుండా మానసిక ఒత్తిడి గురవడం, తొందరపాటు నిర్ణయాలు తీసుకొని చాలా మంది జీవితాలు కోల్పోతున్నారని అన్నారు. స్మార్ట్ ఫోన్ వాడకం తగ్గించి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, యోగ, వ్యాయామం వంటివి అలవాటు చేసుకోవాలని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురైనప్పుడు సహాయం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నంబర్.14416ను సంప్రదించాలని తెలిపారు. పని ప్రదేశాలలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీలు, లోకల్ కంప్లయింట్ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎలాంటి ఇబ్బంది ఎదురైనా ఫిర్యాదు చేయాలని తెలిపారు. మహిళా ఉద్యోగులు భద్రత కలిగిన వాతావరణంలో పని చేసే విధంగా చట్టాలు తోడ్పడతాయని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళల కోసం మానసిక సమస్యలు, న్యాయ హక్కులకు సంబంధించి మెంటల్ హెల్త్ అండ్ లీగల్ రైట్స్ వంటి కార్యక్రమం నిర్వహించడం చాలా మంచి విషయమని అన్నారు. మానసిక ఒత్తిడి, ఉపశమనాలకు సంబంధించి ఈ కార్యక్రమంలో తెలుసుకున్న విషయాలను సద్వినియోగం చేసుకోవాలని, చట్టాలపై పెంపొందించుకున్న అవగాహనను మరింత మందికి తెలియజేయాలని, సురక్షితమైన సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని



అన్నారు. మార్పు ప్రతి ఒక్కరి నుండి మొదలవ్వాలని తెలిపారు. మానసిక వైద్య నిపుణులు డా॥సునీల్ మహిళలు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడి, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి.ఓ. ఎన్.సి.డి. డా॥ప్రసాద్, మోటివేషనల్ స్పీకర్ మధుకర్, ఐ.సి.డి.ఎస్. సి.డి.పి.ఓ.లు, సూపర్వైజర్లు, వైద్యాధికారులు, అంగన్వాడీ టీచర్లు, అధికారులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలి



**బెల్లంపల్లి, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణ నడిబొడ్డులో ఉన్న మున్సిపల్ పాత భవనంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం విరమించుకొని ప్రభుత్వ భూమి 17 సర్వే నంబర్లు 5 ఎకరాల భూమిని ప్రత్యేకంగా కేటాయించి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని సింగరేణి కార్మికసంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపాలిటీ చెత్త తరలింపు డంపింగ్ యార్డ్ సంబంధించిన సమస్య ఎప్పుడు వివాదంగానే మారుతుందన్నారు. డంపింగ్ యార్డ్ నిర్వహణ విషయంలో తగు చర్యలు తీసుకోవడంలో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం విఫలమయ్యిందని ఆరోపించారు. రెండవవార్డు కన్నాల బస్తి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ వద్ద ఉన్నప్పుడు వ్యర్థాలు తగలబెట్టడంతో పరిసర ప్రాంతాల బస్తీలకు ,పొగ దట్టంగా వ్యాపించి ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేసిందని దీంతో తీవ్రమైన వ్యతిరేకత పెల్లుబికిందన్నారు.65 డిప్ బస్తీ వద్ద డంపింగ్ యార్డ్ విషయంలో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని, ఇప్పుడు ఏకంగా బెల్లంపల్లి పట్టణం నడిబొడ్డున పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 34 వార్లకు సంబంధించిన వ్యర్థాలను తీసుకొచ్చి డంప్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.మణిరామ్ సింగ్, చాంద్‌పాషా, ఏఐఎఫ్‌టియు నాయకులు పోషమల్లు, రాజన్న, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఏఐ'పై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

## నిర్మల్ జిల్లా విద్యాశాఖాధికారి రామారావు



**ముథోల్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విద్యపై పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. ముథోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతి రికార్డులను పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విద్య పట్ల అవగాహన కల్పించుటకు ప్రతి పాఠశాలలో కంప్యూటర్లను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతము మన జిల్లాలో 16 ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్య ప్రారంభమైనది అన్నారు. కంప్యూటర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎడ్యుకేషన్ ప్రాథమిక స్థాయిలో నిర్వహించే ప్రాథమిక అక్షరాస్యత మరియు సంఖ్యాశాస్త్రం(ఎఫ్.ఎల్.ఎన్) కు దోహద పడుతుందని అన్నారు. ప్రాథమిక స్థాయిలో బి, సి, గ్రేడ్ విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ప్రాక్టీస్ చేయడం వల్ల విద్యార్థుల యొక్క స్థాయి పెరుగుతుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాలలో స్థాయిలో 50 మంది విద్యార్థులు కలిగి ఉండే పాఠశాలకు కంప్యూటర్లు ప్రభుత్వపరంగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఉపాధ్యాయులకు సలహాలను, సూచనలను తెలిపినారు. జిల్లా కోఆర్డినేటర్ లింబాద్రి, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కవిత ,ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయులు నరసింగ్ రావు, తెలుగు మీడియం,ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్యశాఖలో నేటి నుంచి బయోమెట్రిక్



**నిర్మల్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో రేపటి నుంచి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ అటెండెన్స్ అమలు చేస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ తెలిపారు. గతంలోనే అన్ని ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ ద్వారా హాజరును పర్యవేక్షించడం జరిగిందని అయితే ఇటీల కొన్ని సాంకేతిక ఇబ్బందుల వల్ల బయోమెట్రిక్ పని చేయలేదని, మరమ్మతుల వల్ల కొంతకాలంగా కొన్ని ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ పని చేయలేదని తెలిపారు. వాటన్నిటిని కూడా మరమ్మత్తులు చేయించి అవసరమైన చోట కొత్త వాటిని బిగించి ఆరోగ్య కేంద్రాలలో బయోమెట్రిక్ హాజరును రేపటి నుంచి అమలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

# మట్కాకు కాగజ్‌నగర్ అడ్డా : ఎమ్మెల్యే పాల్వాయి




**కాగజ్‌నగర్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ పట్టణం సట్టా మట్కాకు పెట్టింది పేరని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. రాష్ట్రంలోనే పెద్ద మొత్తంలో సట్కా మట్కా ఆడుతున్న ప్రాంతాల్లో కాగజ్‌నగర్ ఒకటన్నారు. బెట్టింగ్ యాప్ ల కారణంగా 15 నెలల్లో 24 మంది ఆత్మహత్య చేసుకున్నారని బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ క్రైమ్ లో తన కుటుంబ సభ్యులు సైతం రూ. 7 లక్షల పోగొట్టుకున్నారని, సైబర్ క్రైమ్స్ పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

**ఆదాయం కోసం ప్రజలను మద్యానికి బానిసలను చేశారు..**

మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం 25, 600 కోట్ల నుండి 27, 603 కోట్లకు చేరుకుందని రాష్ట్రంలో ప్రతీ కిరాణా దుకాణం బెల్టు షాపు అయ్యిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విచ్చలవిడిగా కొత్త బార్లకు, వైన్ షాప్ లకు అనుమతులు ఇచ్చిందని ఇక మీకు బీఆర్ఎస్ కి తేడా ఏంటని ప్రశ్నించారు. ఆదాయం కోసం ప్రజలను మద్యపానానికి బానిసలుగా మార్చమని అన్నారు.

**జర్నలిస్టుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే..**

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని అసెంబ్లీలో బుధవారం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ప్రస్తావించారు. జర్నలిస్టులు రెక్కడితే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్నారని, కుటుంబా లకు క్యాష్ లెస్ ట్రీట్మెంట్ ఇప్పించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వక సంవ త్సరాలు గడుస్తుందని, వెంటనే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు.




# ఆపదలో రక్తదానం చేసే వారందరూ ప్రాణదాతలే

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

రక్తదానం చేసినవారందరు ప్రాణదాతలే అని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సోమగూడెం కల్వరి మినస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. తలసేమియా వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, రోడ్డు ప్రమాదాలు జరిగిన వారికి రక్తం అవసరం ఉంటుందని తెలిపారు. ఎండాకాలంలో రక్తనిధి కేంద్రంలో రక్తం కొరత ఏర్పడి ఇబ్బందులు పడుతుండడాన్ని గుర్తించి సోమగూడెం కల్వరి మినిస్ట్రీస్, మంచిర్యాల రెడ్ క్రాస్ సొసైటీ వారు రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రక్తదాన శిబిరాల వల్ల రక్తం నిల్వలు పెరుగుతాయని దీంతో రక్తం అవసరం ఉన్న వారికి ఉపయోగపడుతుందన్నారు. బెల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తనిధి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రక్తదాన శిబిరంలో 83 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందించి అభినందించారు. మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన కల్వరి మినిస్ట్రీస్ నిర్వాహకులు ప్రవీణ్, షారోన్‌లను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, బెల్లంపల్లి మాజీ జెడ్పీటీసీ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ నాయకుడు ముత్తినేని రవికుమార్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి మంచిర్యాల కేంద్రం ఇన్‌చార్జీ మధుసూదన్‌రెడ్డి, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.





# జిల్లాలో నకిలీ విత్తనాలు అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు

**వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారుల సమీక్షా సమావేశంలో మంచిర్యాల కుమార్ దీపక్**



**మంచిర్యాల, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల విక్రయం, కొనుగోలుపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడంపై ఏర్పాటు చేసిన సమావేశానికి డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలను అరికట్టడంపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల వినియోగం వలన కలిగే నష్టాలను రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేసే దళారులు, విక్రయదారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలాలలో, గ్రామాలలో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనేలా రైతులకు వివరించాలని తెలిపారు. నకిలీ పత్తి విత్తనాలతో పట్టాదారు, కౌలు రైతులు పంట సాగు చేసినట్లయితే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు నిలిపివేయడం జరుగుతుందని, దళారులపై పి.డి. యాక్టు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో దళారులు ఎవరైనా విడిగా పత్తి విత్తనాలు విక్రయించినట్లయితే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు. హెచ్.టి. కాటన్ సాగు చేసిన రైతులు గ్లైఫోసేట్ కలుపు మందు పిచికారీ చేయడం ద్వారా భూసారం తగ్గుతుందని, క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించాలని, బస్టాండ్, రైల్వేస్టేషన్, జిల్లా సరిహద్దు ప్రాంతాలలో చెకోపోస్టుల వద్ద తనిఖీలు చేపట్టాలని తెలిపారు. దళారులు ఇతర రాష్ట్రాల నుండి నకిలీ విత్తనాలను తీసుకువచ్చి మోసానికి పాల్పడుతున్నారని, రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి పంట సాగు చేసి అధిక లాభాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశిల్దార్లు, ఎ.డి.ఎ.లు, ఎస్.ఐ.లు, మండల వ్యవసాయ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడుచుకు అండగా నిలిచిన గ్రామస్థులు



**గాదిగూడ, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
గాదిగూడ మండలంలోని బుద్కంలోకారి గ్రామస్థులు ఇటీవల వరకట్నాన్ని పూర్తిగా నిషేధిస్తూ తీర్మానించారు. దీంతో అదే గ్రామానికి చెందిన గిరిజన ఆదివాసీ సమాజానికి చెటందిన పేద ఆడపడుచు అనిత పెళ్ళికి గ్రామస్థులు కలిసి ప్రతి ఇంటి నుంచి డబ్బులు జమ చేసి రూ. 11వేల నగదును బుధవారం అందజేశారు. పేద కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జ్యోతిరామ్, మారుతీ, దాసురు, జాలింశావ్, భీంరావు తదితరులు ఉన్నారు.

## ఆదిలాబాద్‌లో బైక్ చోరీ

**ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన తబ్రేజ్ పాషా ఉదయం పాల కోసం వెళ్లి పాలు తెచ్చి ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేశారు. 10:30 గంటల సమయంలో చూడగా బైక్ కనిపించకుండా పోయింది. చుట్టు పక్కల గాలించగా ఆచూకీ లభించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# పండుగలు మతసామరస్యానికి ప్రతీకలు

**నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్ అధికారుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. వివిధ జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి విందును స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలంతా అన్ని పండుగలను కలిసికట్టుగా సహోదర భావంతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని మతాలసారం ఒకటేనని, ప్రజలంతా కలిసి





కట్టుగా ఉంటూ దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. సమాజ సేవ, దయాగుణం వంటి మంచి లక్షణాలను అలవర్చుకోవాలని తెలిపారు. ముస్లింలకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్డీఓ రత్న కళ్యాణి, అధికారులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక మార్గం అలవర్చుకోవాలి

**బేల, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గం అలవర్చుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం బేల మండలంలోని అవల్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 4వ ఆధ్యాత్మిక సత్సంగ్ వార్షి కోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి ఆధ్యాత్మికత ప్రాధాన్యతను వివరించారు. గ్రామస్థులు ఐక్యంగా ఉంటూ ఆధ్యాత్మిక వేడుకలను ఘనంగా జరపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



# జవాబుదారీతనంతో పనులు చేయించాలి

**15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో డీఆర్డీవో దత్తారావు - బీపీఎంలకు షాకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఆర్డీవో ఆదేశం**

**ఆసిఫాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
జవాబుదారీతనంతో ఉపాధిహామీ పనులు చేయించాలని డీఆర్డీవో దత్తారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎ హెచ్‌సీ ఆవరణలో బుధవారం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధిహామీ సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలను ప్రజావేదిక ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో ఈజీఎస్‌లో భాగంగా 371 పనులు చేపట్టగా.. కూలీల వేతనాల రూపంలో రూ. 3.47 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 20.27 లక్షలు చెల్లించినట్లు తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. పంచాయతీరాజ్ ద్వారా 78 పనులు చేపట్టగా కూలీల వేతనాలకు రూ. 14.29 వేలు, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 1.58 కోట్ల చెల్లించినట్లు గుర్తించామని వెల్లడించారు. పంచాయతీల వారీగా చేపట్టిన పనుల వివరాలను తనిఖీ బృందం వివరించగా.. చాలాచోట్ల ఈజీఎస్ సిబ్బంది పూర్తి స్థాయిలో రికార్డులు నమోదు చేయకపోవడంపై డీఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల వివరాలను తెలిపే బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, కొలతల్లో తేడాల కారణంగా కూలీలు నష్టపోవడం వంటి అంశాలు తనిఖీలో బయటపడినట్లు సభ్యులు తెలిపారు. బీపీఎంలు కూలీలకు చెల్లించాల్సిన డబ్బులను నెలల తరబడి వారి వద్దే ఉంచుకుంటున్నట్లు గుర్తించామని తెలపడంతో.. బీపీఎంలకు షాకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఆర్డీవో ఆదేశించారు. కైరిగాంలో పంచాయతీలో చేపట్టిన పనులకు సంబంధించి పత్రాలపై ఏపీవో సంతకాలు లేకుండానే రూ. 2లక్షల వేతనాలను కూలీలకు చెల్లించారని తెలిపారు. దానికి ఆపరేటర్ బాధ్యత వహించి కూలీలకు చెల్లించిన మొత్తాన్ని ఆయన ద్వారా రికవరీ చేయాలని డీఆర్డీవో ఆదేశించారు. పని ప్రదేశాల్లో నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని, ఇందులో ఎవరైన అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అదే విధంగా ఉపాధి కూలీల పట్ల పని ప్రదేశంలో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు శంకరమ్మ, శ్రీనివాస్, హెచ్‌ఆర్ మేనేజర్ మల్లేశ్, హ్యూమన్ రిసోర్స్ పర్సన్ రజినీకాంత్, క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేశ్, ఏపీవోలు రామ్మోహన్ రావు, బుచ్చన్న, ఎస్ఆర్పీ తిరు పతి, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



# హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)
ఓ హత్య కేసులో నిందితుడైన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి కె ప్రభాకర్ రావు బుధవారం తీర్పు వెలువరించారు. దీనిపై స్పందించిన ఎస్పీ అఖిల్ మహాజన్ నేరం చేసే వారికి ఖచ్చితంగా శిక్ష పడుతుందనే నమ్మకం న్యాయస్థానం ద్వారా లభిస్తుందని, చట్టం దృష్టిలో ప్రతి ఒక్కరు సమానమేనని తెలిపారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చట్టం దృష్టి నుండి తప్పించుకోలేరని పేర్కొన్నారు. కాగా 2022 సంవత్సరం ఆగస్టు 21వ తేదిన సాయంత్రం ఐదు గంటల 15 నిమిషాలకు జైనథ్ మండలంలోని రాంపూర్ టి గ్రామానికి చెందిన కొడిమెల ప్రభాకర్ అనే వ్యక్తి పాత కక్షలు మనసులో ఉంచుకొని ఉట్ల రమేష్ అనే వ్యక్తిని స్థానిక బుద్ధ విహార్ వద్దా విచక్షణారహితంగా కుట్రపూరితంగా కత్తితో పొడిచి, కొట్టి చంపేసినట్లు కోర్టు లైజన్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై జైనథ్ పోలీస్ స్టేషన్ లో అప్పటి ఎస్సై బి పెర్సిస్ కేసు నమోదు చేయగా, అప్పటి జైనథ్ సిఐకే నరేష్ కుమార్ సాక్షులను విచారించి నేర స్తునిపై చాజీషీటు దాఖలు చేయగా, ఈ కేసులో విచారణ జరపగా,కోర్టు డ్యూటీ అధికారి ఎంఏ జమీర్ 18 మంది సాక్షులను ప్రవేశపెట్టారని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేకల మధుకర్ విచారించి నిందితునిపై నేరం రుజువు చేయగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకర్ రావు నిందితునికి యావ జీవ కారకార శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తు, ఈ కేసులో నేరస్తునికి శిక్ష పడడంలో ఉత్తమ ప్రతిభ కనబ రిచిన కోర్టు డ్యూటీ అధికారిని, కోర్ట్ లైసెన్టికారిని, పిపిని జిల్లా ఎస్పీ అభినందించారు.





## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన సీఐ

బెల్లంపల్లి, మార్చి 26 (ప్రభాత సమాచారం)
పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను బెల్లంపల్లి ఒకటో పట్టణ సీఐ దేవయ్య తనిఖీ చేశారు. విద్యార్థులు ఎవరు కాపీయింగ్‌కు పాల్పడవద్దని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలని సూచించారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియా జడ్పిహెచ్ఎస్ పాఠశాలను మరియు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, సోషల్ వెల్ఫేర్ కాలేజీతో పాటు ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు.

## ఏఎన్ఎంలకు వేతనాలు పూర్తి స్థాయిలో చెల్లించాలి



ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)
ఐటిడిఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల వేతనాలు పూర్తి స్థాయిలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఐటిడిఏ పిఓ ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందించారు. ఏఎన్ఎంలకు పూర్తి వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, హెచ్ఎం, వార్డెన్ల వేధింపులను అరికట్టాలని కోరారు. ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



గుడిహత్నూర్, మార్చి 26 (ప్రభాత సమాచారం)
గుడిహత్నూర్ మండలం మాన్నూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ. 3 లక్షలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ బుధవారం భూమిపూజ చేశారు. అన్ని వర్గాల, గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ కోవ తులసి, జలపత్, గ్రామస్తులున్నారు.

## కార్మికుడి మృతికి సంతాపం తెలిపిన నేతలు

ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)
ఆదిలాబాద్ కెఆర్‌కె కాలనీకి చెందిన మున్సిపల్ కార్మికుడు గంగన్న బుధవారం ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఆయన మృత దేహానికి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, జిల్లా సహాయ కార్యదర్శి గంగయ్య, మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు గంగన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## పుట్టెడు దుఃఖంలో 'పది' పరీక్షకు..

దహెగాం, మార్చి 26 (ప్రభాత సమాచారం)
తండ్రి చనిపోయి పుట్టెడు దుఃఖం ఉన్నా ఆ బాధను దిగమింగుకుంది.. అల్లారుముద్దుగా పెంచిన నాన్న ఇక లేడని తెలిసినా ఆయన కష్టం వృథా కావొద్దని పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరైంది ఓ విద్యార్థిని. ఈ విషాద ఘటన జిల్లాలో బుధవారం చోటుచేసుకుంది. దహెగాం మండలం చౌక గ్రామానికి చెందిన మేకల రాజయ్య(40), సత్తెక్క దంపతులకు కుమార్తె అనురాధ, ఇద్దరు కుమారులు ఉన్నారు. అనురాధ మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి చదువుతోంది. రాజయ్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో మంగళవారం మంచిర్యాలలోని ఆస్పత్రికి తరలించగా, బుధవారం తెల్లవా రుజామున 3గంటల సమయంలో మృతిచెందాడు. అను రాధ తండ్రి చనిపోయిన బాధను దిగమింగుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణితం పరీక్షకు హాజరైంది. పరీక్ష పూర్తికాగానే కుటుంబీకులు విద్యార్థినిని ఇంటికి తీసుకెళ్లారు. తండ్రి మృతదేహాన్ని చూసి అనురాధ బోరున వి లపించింది. స్వగ్రామంలో రాజయ్య అంత్యక్రియలు పూర్తిచేశారు.



## 'ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం'

### బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



బెజ్జూర్, మార్చి 26 (ప్రభాత సమాచారం)
రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బెజ్జూర్ మండలంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర ప్రజల కష్టాలు తీరాలన్నా.. రైతుల కన్నీళ్లు ఆగాలన్నా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. కల్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికీ ఇవ్వడం లేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500, రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మండలంలోని గబ్బాయి, పాపన్పేట్, తలాయి, సోమిని, మొగవెల్లి, బారెగూడ, ముంజంపల్లి గ్రామాల్లో పర్యటించారు. రైతులు, మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుకుడ గ్రామంలోని పలువురు యువకులకు కండువా కప్పి బీఆర్ఎస్లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యాంరావు, నాయకులు కాశిపాక రాజు, సారయ్య, దుర్గం తిరుపతి, ఖాజా, షాముద్దీన్, ఆత్రం హరీశ్ పాల్గొన్నారు.

## వేతనాలలో కోతలు విధించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

### సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్

ఉట్నూర్, మార్చి 26 (ప్రభాత సమాచారం)
ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల వేతనాలలో కోత విధిస్తున్న కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఏఎ సిఎంలతో కలసి సీఐటీయు ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ ఏఎన్ఎంలకు పూర్తి వేతనాలు చెల్లించని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. విత్తనాల కటింగ్ పై పూర్తి సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పూరీ వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్సు సౌకర్యాలు కల్పించి, ఆరోగ్య భీమా, ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు అందించి ఎచ్ఎం, వార్డెన్ ల వేధింపులను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఏఐస్ ఎం యూనియన్ కార్యదర్శి అనిత, ఏఎస్ఎం కోశాధికారి శ్యామ్ సుందర్, సహాయ కార్యదర్శులు జంగుబాయి, రాజేష్ పాల్గొన్నారు.

## రైతులకు వ్యవసాయ పనిముట్లు

బోథ్, మార్చి 26 (ప్రభాత సమాచారం)
వ్యవసాయ యాంత్రీకరణ 2024-25 గాను బోథ్, సోనాల మండలాలకు ప్రభుత్వం 23 వ్యవసాయ పనిముట్లు ఇవ్వనున్నట్లు బోథ్ సహాయ వ్యవసాయ సంచా లకులు శ్రీధర్ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనరల్ కేటగిరికి 16, ఎస్సీ కేటగిరికి 4. ఎస్టీ కేటగిరికి 3 కేటాయించారు. అందులో బ్యాటరీ, పాదం, మానవీయంగా పనికిసే స్ప్రేయర్ (జనరల్- 4, ఎస్సీ-1 ఎస్టీ-1 ) పవర్ స్ప్రేయర్, కేటగిరి వారిగా జనరల్ 4, ఎస్సీ-1, ఎస్టీ- 1, రోటవేటర్ జనరల్ 3. ఎస్సీ-1, సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్ జనరల్ 1, డిస్క్ హారో, కల్టివేటర్, ఎంబి నాగాలి, కేజీవీల్ కింద జనరల్ 3, ఎస్సీ-1, ఎస్టీ- 1 మొక్కజొన్న పెల్లర్ జనరల్ 1 వ చ్చాయన్నారు. ఈ ఏడాది పనిముట్లు పొందేందుకు మ హిళా రైతులే అర్హులని తెలిపారు. ఈ రాయితీ పొం దేందుకు మహిళల పేరు మీద భూమి నమోదై ఉండాలని దరఖాస్తు, పట్టపాస్ బుక్, ఆధార్ కార్డు, సాయిల్ హెల్త్ కార్డ్ తప్పనిసరి పేర్కొన్నారు. చిన్న, సన్నకారు మహిళా రైతులకు 50% సబ్సిడీ, మిగితా మహిళా రైతులకు 40% సబ్సిడీ ఉంటుందన్నారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తులు, వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

వాంకిడి, మార్చి 26 (ప్రభాత సమాచారం)
పెళ్లికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. మండలంలోని కోమటి గూడ గ్రామానికి చెందిన కొట్రాంగి మహేశ్(29) కొత్త దుబ్బగూడలో బంధువుల పెళ్లికి మంగళవారం వెళ్లాడు. రాత్రి 10 గంటలు దాటాక మహారాష్ట్రలోని భారి గ్రామానికి చెందిన ముండే మానిక్‌ఆవు ఆటోలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఆటో ప్రమాదానికి గురైంది. గ్రామ సమీపంలోని రహదారిపై మూలమలుపు వద్ద ఉన్న స్తంభానికి వేగంగా ఢీకొట్టింది. దీంతో మహేశ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భయందోళనకు గురైన మానిక్ రావు బోల్తాపడ్డ ఆటోను లేపుకొని భారీ గ్రామానికి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం స్థానికులు అటుగా వెళ్తుండగా మహేశ్ పడి ఉండటాన్ని గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలం వద్ద ఆటో నంబర్, పగిలిన అద్దాలు పడి ఉండటంతో రోడ్డు ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. మహారాష్ట్రకు చెందిన మానిక్‌ఆవును అదుపులో తీసుకున్నారు. కాగా, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మృతుడికి భార్యతోపాటు నాలుగేళ్ల కూతురు ఉంది.

## గిర్నూర్ గ్రామంలో కార్డన్ సెర్చ్

బజార్‌హత్నూర్, మార్చి 26 (ప్రభాత సమాచారం)
నియోజకవర్గంలోని బజార్‌హత్నూర్ మండలంలో ఉన్న గిర్నూర్ గ్రామంలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు సీఐ వెం కటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో బజార్ హత్నూర్, బోథ్ ఎస్సై లు అప్పారావు, ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

## ఇందిరమ్మ మోడల్ హౌస్ పరిశీలన

బెజ్జూర్, మార్చి 26 (ప్రభాత సమాచారం)
బెజ్జూర్ మండల కేంద్రంలోని ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను తహసీల్దార్ భువనేశ్వర్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం నమూనాగా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌసన్ను తహ సీల్దారు పరిశీలించారు. ప్రభుత్వం రూపాయలు ఐదు లక్షలతో ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మిస్తోందన్నారు. ఇందిరమ్మ మోడల్ హౌసింగ్ త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను తహసీల్దార్ ఆదేశించారు. ఆయన వెంట బెజ్జూర్ డిప్యూటీ తహసీల్దార్ భీమ్లా నాయక్, సీనియర్ అసిస్టెంట్ అచ్యుతరావు, రెవెన్యూ ఇన్ స్పెక్టర్ రవి, సిబ్బంది ఉన్నారు.

# నీటి ఎద్దడిని తీర్చండి.. కలెక్టర్‌కు మాజీ కౌన్సిలర్ల వినతి



**ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ పట్టణంలో మూడు దశాబ్దాల్లో ఎప్పుడు లేని విధంగా నీటి ఎద్దడి కొనసాగుతోందని కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ కౌన్సిలర్లు ఆరోపించారు. బుధవారం కలెక్టర్ రాజర్షితోపాటు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరో రెండు నెలల్లో నీటి ఎద్దడి అతి తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉన్నందున దీనిపై ప్రత్యేక దృష్టి సాధించాలని కోరారు. అదేవిధంగా లాండసాంగి వద్ద రెండు చెక్ డ్యాంలు నిర్మించాలని, మావల వాటర్ వద్ద మట్టి పూడికతీత తీయాలని, పట్టణంలో మరో 10 వాటర్ ట్యాంకర్లు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా కాలనీలలో ఉన్న ప్రతి వాటర్ ట్యాంకు వద్ద మరో పెద్ద బోరు వేసి వాటి నీటిని ట్యాంకు ఎకించాలన్నారు. నిర్మల్ నుంచి మిషన్ భగీరథ నీరు కూడా నిరంతరంగా వచ్చేటట్లు చేయాలన్నారు. ఈ మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వీరిని కలిసిన వారిలో జహీర్ రంజానీ, కలాల శ్రీనివాస్, బండారి సతీష్, సంద నర్సింగ్, ఆవుల వెంకన్న, దర్శనాల లక్ష్మణ్, ఇజ్జగిరి సంజయ్ ఉన్నారు.



## విద్యార్థులు కంటి సమస్య ఉంటే అద్దాలు వాడాలి

**జన్నారం, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

కంటి సమస్య ఉన్న విద్యార్థులు కంటి అద్దాలను తప్పకుండా వాడాలని ఆర్బీఎస్కే జిల్లా సహాయ అధికారి గౌరీ శంకర్ సూచించారు. బుధవారం జన్నారం మండలంలోని కలమడుగు గ్రామ జడ్పీ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి 24 మంది విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల హెచ్ఎం కట్ట రాజమౌళి, ఆర్బిఎస్కే అధికారులను అభినందించారు. విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసిన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ పోచయ్య, ఉపాధ్యాయులు రమేష్ రాజేందర్ తిరుపతి కవిత తదితరులు పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్ షాపులో తనిఖీ

### నకిలీ పరుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

**తాండూర్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని బాలాజీ ఫెర్టిలైజర్ షాపును బుధవారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, మందులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని, రసీదులు ఇవ్వాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, రేషన్ షాప్ డీలర్లతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల గురించి అధికారులను ఆర్డిఓ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, నాయబ్ తహసీల్దార్ ప్రసాద్, ఏవో సుష్మ, ఎస్సై కిరణ్ కుమార్, గిర్ధవర్ ఏజాజోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయలో సత్తా చాటిన స్లేట్ ఎక్సలెన్స్ విద్యార్థులు



**జన్నారం, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

ఇటీవలే వెలువడిన నవోదయ పరీక్షా ఫలితాల్లో మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. స్లేట్ ఎక్సలెన్స్ పాఠశాలకు చెందిన డి.అభిరామ్,డి.విశ్వసాయి, ఆర్ భరద్వాజ్‌లు నవోదయకు ఎంపికైనట్లు స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నవోదయ ఎంపికైన ఆ ముగ్గురు విద్యార్థులను చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు. గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడానికి కృషి చేస్తున్నామని, వారిని అన్ని రంగాలలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఛైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నదవోదకు ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## ఏఆర్ఎస్ కళాశాలలో జాబ్ మేళా



**జన్నారం, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని ఏ ఆర్ ఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఇషికా కన్సల్టేషన్ ఆధ్వర్యంలో డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థి విద్యార్థినీలకు క్యాంపస్ ప్లేస్మెంట్‌ల కొరకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో 30 మంది విద్యార్థులు వివిధ కంపెనీలలో సెలెక్ట్ అయ్యారు. సెలెక్ట్ అయిన విద్యార్థి విద్యార్థులక ఏ ఆర్ ఎస్ ప్రిన్సిపాల్ ముత్యం సతీష్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే రోజులలో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్మెంట్లు కల్పిస్తామన్నారు రఘు, వనిత, రాజశేఖర్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్

## కమిటీలో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్.సి, ఎస్.టి., పి.సి.ఆర్.పి.ఓ.ఎ. యాక్ట్ -1989 నందు కేటగిరి-ఎఫ్లో ఐదుగురు అనధికార సభ్యులు షెడ్యూల్డ్ కులముల / షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు సభ్యత్వం కొరకు, కేటగిరి-జి నందు ముగ్గురు నాన్ అఫిషియల్ సభ్యులు స్వచ్ఛంద సంస్థలతో సంబంధాన్ని కలిగి ఉన్న ఎస్.టి., ఎస్.టి.లు కాకుండా ఉన్న జిల్లాకు చెందిన వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు తాము చేసిన సేవా కార్యక్రమాలతో కూడిన ఆధారాలు పేపర్ క్లిప్పింగ్లు, ఫొటోలు, స్వచ్ఛంద సేవా సంస్థలకు చేసిన సేవలతో కూడిన ఆధారాలతో ఏప్రిల్ 2వ తేదీ సాయంత్రం 5 గం॥ల లోగా జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, కమిటీ నందు ఎన్నికైన సభ్యులకు ఎలాంటి పారితోషికం టిఎ, డి.ఎ.లు ఉండవని తెలిపారు.

## ఉరేసుకుని యువకుడి బలవ్మనణం

**ఇంద్రవెల్లి, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

మండలంలోని బిక్కుతాండ గ్రామంలో యువకుడు ఉరే సుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు.. సెడ్మాకి చంద్రకాంత్(28) వ్యవసాయ కూలీ పని చేస్తున్నాడు. భార్య మంజుల గ్రామంలో అంగన్వా డీ కేంద్రంలో ఆయాగా చేస్తోంది. వీరికి ఇద్దరు కుమారులు. చంద్రకాంత్ గత 10 రోజులుగా జ్వరం బాధపడుతున్నాడు. మతిస్థిమితం కోల్పోయినట్లు వ్యవహరించడంతో కుటుంబ సభ్యులు ముత్నూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికి త్స అందించడంతో కుదుటపడింది. ఇంటికి వచ్చాక తనకు ఏదో అవుతుందని భయపడేవాడు. రాత్రి ఇంట్లో నిద్రపో యేవాడు కాదు. బుధవారం ఉదయం భార్యను డ్యూటీకి వెళ్లాలని చెప్పి ఆమె వెళ్లాక దూలానికి ఉరేసుకున్నాడు. చుట్టూ పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

## దొరికిన ఫోన్ అప్పగించిన ఆటో డ్రైవర్

**బోథ్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ నౌసాద్ ఖాన్‌కు సెల్ ఫోన్ దొరకడంతో బుధవారం సీఐ వెంకటేశ్వరరావు సమక్షంలో ఆవ్యక్తికి అందించారు. బుధవారం ఉదయం ఇచ్చోడ గ్రామానికి చెందిన రమణయ్య తన బైక్‌పై పని నిమిత్తం బోథ్ కు వచ్చే క్రమంలో సెల్ ఫోన్ జారిపోయింది. సెల్ ఫోన్ బోథ్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నౌసాద్ ఖాన్‌కు దొరకగా సీఐ సమక్షంలో వారికి అందించారు. సెల్ ఫోన్ అప్పగించిన వ్యక్తిని పోలీసులు, గ్రామస్తులు, ఆటో యూనియన్ వారు అభినందించారు.

## అనారోగ్య సమస్యలో మున్సిపల్ కార్మికుడి మృతి

**ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

మావల పోలీసుస్టేషన్ పరిధిలోని పాలిటెక్నిక్ ప్రాంతంలో ఒకరు మృతిచెందినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో కార్మికుడిగా పనిచేస్తున్న గంగన్న (42) అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఉదయం పని నిమిత్తం ఇంటి నుంచి బయల్దేరిన ఆయన తిరిగి రాలేదు. మద్యం మత్తులో పాలిటెక్నిక్ శివారు ప్రాంతంలోని చెత్తకుప్పలో మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు ఓంకార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రైస్ మిల్ సీజ్ చేసిన అధికారులు



**నర్సాపూర్ (జి), మార్చి 26 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలోని శ్రీ అనంత ఆగ్రో రైస్ మిల్లును రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం సీజ్ చేశారు. 2022-2023 ఖరీఫ్, రబీ సీజన్‌లలో 3,191 మెట్రిక్ టన్నుల ధాన్యం తీసుకున్నారు. కొన్ని నెలలుగా ఆగ్రో రైస్ మిల్లు ఉపయోగంలో లేనందున నోటీసులు పంపినా స్పందించకపోవడంతో శ్రీ ఆగ్రో రైస్ మిల్లు వద్దకు అధికారులు వెళ్లారు. అక్కడ గేట్ తాళాలు వేసి ఉన్నందున యజమానికి సమాచారం ఇచ్చారు. అధికారులు దాదాపు ఒక గంట సేపు వేచి చూశారు. ఫలితం లేక పోవడంతో తాళాలు వేసిన గేట్‌ను పగలగొట్టి పూర్తి వివరాలు తీసుకుని పంచనామా చేశారు. అనంతరం సీజ్ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, సివిల్ సప్లయ్ అధికారిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రమాదేవి, ఏఎస్ఐ శంకర్, ఆర్ఐ నవత జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ రాజ్ కుమార్ ఉన్నారు.

### ఆసుపత్రిని సందర్శించిన

## కాయకల్ప బృందం

**ఉట్నూర్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

ఉట్నూర్ జిల్లా ఆసుపత్రిని బుధవారం కాయకల్ప బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ల్యాబ్, రోగులకు అందుతున్న సౌకర్యాలు, మందులు నిర్వహణ, పరిశుభ్రత, వికలాంగులు ఆసుపత్రికి వచ్చేందుకు సౌకర్యాలు, సిబ్బంది పనితీరు, బెడ్స్ నిర్వహణ అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉపేందర్ మాట్లాడుతూ.. ఆసుపత్రిని కాయకల్ప టీం సందర్శించిందని, త్వరలో మరో టీం వస్తుందన్నారు. తమకు మూడేండ్లుగా కాయకల్ప సర్టిఫికెట్ వస్తుందన్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అదుపుతప్పి కంటైనర్ బోల్తా

**సోన్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**

మండలంలోని గంజాల్ సమీపంలో బుధవారం 44వ జాతీయ రహదారి పక్కన కంటైనర్ బోల్తాపడింది. ఎస్సై గోపి కథనం ప్రకారం.. కంటైనర్ నాగపూర్ నుంచి చెట్ల మూలికలతో హైదరాబాద్ వైపు వెళ్తుంది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్ దుర్గేష్ కుమార్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో కంటైనర్ బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పెట్రో కార్ విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వాహనాలు పరిమితికి మించి అతివేగంగా నడపడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు.

# అభివృద్ధికి నోచుకోని కృషి విజ్ఞాన కేంద్రం

- ఏడేళ్లుగా నిధులు మంజూరుకాని వైనం
- ప్రహరీలేక పంటలు పశువుల పాలు..
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



**బెల్లంపల్లి, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
రైతులకు మెరుగైన సేవలు, ఆధునిక సాంకేతికతను చేరువ చేయడంతో పాటు వివిధ అంశాల్లో మెరుగైనసేవలు అందించాలనే సంకల్పంతో మంచిర్యాల, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల రైతుల కోసం ఏర్పాటైన కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) అభివృద్ధికి నోచుకోవడం లేదు. బెల్లంపల్లిలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రారంభమైన ఏడేళ్ల నుంచి అభివృద్ధి కోసం నిధులు రావడం లేదు. దీంతో కేవీకే ఆవరణలో సాగుచేసిన పంటలకు రక్షణ కోసం ఎలాంటి ఫెన్సింగ్, ప్రహరీ లేకపోవడంతో పంటలు పశువులపాలవు తున్నాయి. భూమి చదును లేకపోవడంతో విత్తనోత్పత్తి చేయలేని పరిస్థితి నెలకొంది.

**50 ఎకరాల్లో ఏర్పాటు..**
బెల్లంపల్లిలో 2018లో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ కేంద్రం ఏర్పాటైంది. ఇందులో రెండు కోట్ల రూపాయలతో కృషి విజ్ఞాన కేంద్రం భవనంతో పాటు రూ. 80 లక్షలతో రైతువసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతులకు ఏడేళ్లుగా సేవలందిస్తోంది. కేవీకే ద్వారా రైతులకు ఆధునిక పద్ధతులపై శిక్షణ, చీడపీడల నివారణ, నూతన వంగడాలను అందించడం వంటివి కేవీకే శాస్త్రవేత్తలు చేస్తున్నారు. సాంప్రదాయ సాగుతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులు ఆధునిక సేద్యంతో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాల్లోని పలు గ్రామాల్లో కిసాన్‌మేళావంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**సాగుకు నోచుకోని భూమి..**
కృషి విజ్ఞాన కేంద్రం 50 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కాగా భవనం, రైతు వసతి గృహం, రహదారులు పోనూ మిగతా భూమిని శాస్త్రవేత్తలు వివిధ పంటల సాగుకు ఉపయోగించాలి. కాని ఇందులో కేవలం 20 ఎకరాల భూమి మాత్రమే సాగుచేసి విత్తనోత్పత్తి చేస్తున్నారు. ఇందులో వరి, పత్తి, తీగజాతి, కూరగాయల పెంపకం, వంగడాల ఏర్పాటు, చేపల పెంపకం వంటివి చేస్తున్నారు. మరో 25 ఎకరాల భూమి సాగు లేక బీడుగా ఉంది. ఈ భూమి చదునుగా లేకపోవం, సాగుకు అనుకూలంగా లేకపోవడంతో సాగు చేయలేని దుస్థితి నెలకొంది. ఏడేళ్లుగా నిధులు రా కపోవడంతో భూమిని చదును చేయలేక సాగు చేయడం లేదు.

**పంటలు అటవీ జంతువుల పాలు.....**
కేవీకే ఆవరణలో దాదాపు 20 ఎకరాల భూమిలో వివిధ పంటలు విత్తనోత్పత్తి కోసం శాస్త్రవేత్తలు సాగు చేస్తున్నారు. కొన్ని పంటలు మొక్క దశలోనే అటవీ జంతువులు, పశువుల పాలవుతున్నాయి. మరికొన్ని పంటలు దిగుబడి వచ్చే సమయంలో నష్టపరుస్తుండడంతో పూర్తిస్థాయిలో రైతులకు వివిధ పంటలపై అవగాహన కల్పించలేకపోతున్నారు. విత్తనోత్పత్తి సైతం సరిగా దిగుబడి కావడం లేదు. కృషి విజ్ఞాన కేంద్రానికి కేవలం ముందు నుంచే ప్రహరీ ఉండడం, ఇతర మూడు పక్కల ఎలాంటి ప్రహరీలేకపోవడం, ఫెన్సింగ్ లేకపోవడంతో అటవీ జంతువులు, పశువులు కృషి విజ్ఞాన కేంద్రంలోనికి వెళ్లి పంటలను ధ్వంసం చేస్తున్నాయి.

**గోదాం లేకపోవడంతో..**
కేవీకే కేంద్రంలో వరి, కంది, వేరుశనగా, జనుము, నువ్వులు వంటివి ప్రతీ ఏటా విత్తనోత్పత్తి చేస్తుంటారు. దిగుబడి వచ్చిన పంటను భద్రపరిచేందుకు గోదాం సైతం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో వేల మంది రైతులకు శిక్షణ కార్యక్రమాలు ప్రతీ ఏటా నిర్వహిస్తుంటారు. ఆరుబయటే శాస్త్రవేత్తలు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

## బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



**ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, 18 సంవత్సరాలు నిండిన తరువాతే ఆడపిల్లలకు వివాహం చేయాలని షూర్ ఎన్జీవో ఆధ్వర్యంలో బుధవారం ఆదిలాబాద్ కే. ఆర్.కే కాలనీలోని మక్క మసీదు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల అనర్థాలతో పాటు రక్తహీనత, శిశు మరణాలు, మాతృమరణాలు సంభవిస్తాయన్నారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని, బాల్యవివాలు జరిగితే 1098, లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని డీసీపీయూ యూనిట్ సిబ్బంది ప్రేమ్ అన్నారు. షూర్ ఎన్జీవో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, మసీదు అధ్యక్షుడు అజర్ అలీ తదితరులు ఉన్నారు.

## ఉద్యోగుల భవిష్య నిధి ఆధ్వర్యంలో 27న అవగాహన శిబిరం

**మంచిర్యాల, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా అవగాహన శిబిరం, ఔట్రీచ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని సహాయ పి.ఎఫ్. కమీషనర్ తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5.45 గంటల వరకు జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సభ్యుల ఫిర్యాదుల పరిష్కార వేదికగా, సమాచార మార్పిడి నెట్వర్క్ ఔటీచ్ కార్యక్రమం ఉపయో గపడుతుందని తెలిపారు. సభ్యులు, కార్మిక సంఘాలు, యజమానుల సంఘాలు వారి ఫిర్యాదులను పరిష్కరించుకోవడానికి సదస్సు ఉపయోగపడుతుందన్నారు.

## నడుచుకుంటూ వెళ్తున్న మహిళను బెదిరించి..

**ఉట్నూర్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
నడుచుకుంటూ వెళ్తున్న మహిళను ఎస్పీ సారూ పిలుస్తున్నారని ముగ్గురు యువకులు బెదిరించి ఆమె మెడలో బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. మండల కేంద్రంలో బుధవారం పట్టపగలే ఈ ఘటన చోటు చేసుకుంది. ఇంద్రవెల్లి మండలానికి చెందిన ఐసీడీఎస్ సూపర్వైజర్ ఉమా పని ని మిత్తం బుధవారం ఉట్నూరికి వచ్చింది. స్థానిక జూనియర్ మున్సిఫ్ కోర్టు ముందు నడుచుకుంటూ వెళ్తుండగా ఎస్పీ సారూ పిలుస్తున్నారని గేటు వద్ద ముగ్గురు పోలీసులమని దూరం నుంచి ఐడీ కార్డు చూపెడుతూ బెదిరించారు. మాయమాటలతో ఆమె మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని తెలిపింది. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. కాగా, ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని చుట్టుపక్కల సీసీ కెమెరాలను పరిశీలించారు.

## కూతురిపై అసభ్యంగా ప్రవర్తించిన తండ్రి

### పోక్సో కేసు నమోదు - మందమర్రిలో ఘటన

**మందమర్రి, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
కూతురిపై అసభ్యంగా ప్రవర్తించిన తండ్రిపై పోక్సో కేసు నమోదైంది. పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజశేఖర్ ఈమేరకు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని యాపల్ ప్రాంతానికి చెందిన ఆకుదారి సతీశ్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా భార్యతో గొడవలు జరుగుతున్నాయి. పెద్ద కూతురు (15) హాస్టల్లో చదువుతుండగా పోచమ్మకు చేసుకునేది ఉందని మంగళవారం తీసుకువచ్చాడు. సాయంత్రం మద్యం తాగి ఇంటికి చేరుకుని కూతురు తనకు పుట్టలేదని అనుమానంతో ఆమైపె రాత్రి ఆసభ్యంగా ప్రవర్తించాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన భార్యను గాయపరిచాడు. భార్య ఫిర్యాదుతో బుధవారం పోక్సో




కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాధితురాలిని కౌన్సెలింగ్ నిమి త్తం భరోసా కేంద్రానికి పంపినట్లు పేర్కొన్నారు.

## అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

**మంచిర్యాల, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
మందమర్రికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి పల్లెం రాజలింగు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. గోవాలో ఇటీవల జరిగిన 47వ యోనెక్స్ సన్రైజ్ ఆలిండియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్షిప్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. 75 సంవత్సరాల విభాగంలో సింగిల్స్, డబుల్స్లో వరంగల్ క్రీడాకారుడు నర్సయ్యతో కలిసి పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించి, అంతర్జాతీయ పోటీలకు ఎంపికై న రాజలింగును బుధవారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, జాయింట్ సెక్రటరీ రమేశ్ రెడ్డి, అడ్వైజర్ కృష్ణ, సీనియర్ క్రీడాకారుడు మురళీ అభినందించారు. ఈ సందర్భంగా రాజలింగు మాట్లాడుతూ ఒథాయిలాండ్లో నిర్వహించే అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యానని తెలిపారు. గతంలో రెండుసార్లు ఈ పోటీలకు ఎంపికయ్యానని ఆర్థిక స్థోమత లేక పోటీల్లో పాల్గొనలేదన్నారు.



## రెబ్బెనలో కారిఫోర్డ్ సిరఫ్ సీజ్

**రెబ్బెన, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
రెబ్బెనలో నిబంధనలకు విరుద్ధంగా ఔషధాలపై ప్రకటనలు ఉన్న కారిఫోర్డ్ సిరఫ్ ను డ్రగ్ ఇన్స్పెక్టర్ అశ్విని సీజ్ చేశారు. బుధవారం రెబ్బెనలో పలు మెడికల్ షాపులను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ 1954 చట్టం ప్రకారం మందుల లేబుల్స్, కవర్లపై ప్రకటనలు ఇవ్వడం చట్టవిరుద్ధమని, అలా ముద్రించిన కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## బంగారం గొలుసు చోరీ

**ఇచ్చోడ, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
బస్సు కోసం వేచిచూస్తున్న మహిళకు బైక్‌పై నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు మాయమాటలు చెప్పి బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. మండలంలోని బోరిగామకు చెందిన ముల్కల లక్ష్మి బుధవారం ఉదయం 11 గంటలకు గాంధీనగర్ బస్టాప్ వద్ద బస్సు కోసం వేచిచూస్తుంది. ఈక్రమంలో బైక్పై వచ్చిన ఇద్దరు ఆ వద్దకు వెళ్లారు. భార్య బంగారం గొలుసు పోయిందని, అందరి వద్ద చెక్ చేస్తున్నామని ఆమెకు మాయమాటలు చెప్పి నమ్మించారు. మహిళ మెడలో బంగారం గొలుసు తీసి ఇవ్వమని అడిగారు. వారి మాటలు నమ్మి గొలుసు ఇవ్వగానే చూసినట్లుగా నమ్మించి ఒక పేపర్‌లో చుట్టి ఆమె చేతికి ఇచ్చి పరార య్యారు. ఆ పేపర్లో చూడగా బంగారు గొలుసు లేకపో వడంతో లబో దిబోమంది. పోలీసుస్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

## నేడు వారసంత వేలం పాట

**ముథోల్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
ముధోల్‌లోని గ్రామపంచాయతీ పరిధిలోని వారసంత వేలం పాటను గురువారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అన్వర్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు గురువారం తేదీ 27న ముధోల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పదివేల రూపాయలను, రెండు చెక్కులను దరావస్తుగా జమ చేయాలని తెలిపారు.

## ఇంటికే రామలోరి తలంబ్రాలు

**ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
భద్రాచలం శ్రీరాముల వారి కళ్యాణ తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా భక్తుల ఇంటి వద్దకు తీసుకొచ్చి ఇవ్వనున్నట్లు రీజినల్ మేనేజర్ సోలోమాన్ తెలిపారు. గురువారం ఆదిలాబాద్‌లోని ఆర్ఎం కార్యాలయంలో రాములవారి తలంబ్రాల పోస్టర్లను ఆవిష్కరించారు. భక్తులు కార్గో కౌంటర్లలో రూ.151 చెల్లించి బుక్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు రీజియన్ పరిధిలో దాదాపు 1000 మంది భక్తులు తలంబ్రాల కోసం బుక్ చేసుకున్నట్లు వెల్లడించారు.









# 'ఫల'హారం

**భా**నుడు భగ్గుమంటున్నాడు.. రోజు రోజుకూ ఎండ తీవ్రత అధికమవుతోంది.. ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు.. కానీ వెళ్లక తప్పదు.. దీంతో ఎండదెబ్బ తగిలి నీరసపడడం.. వడదెబ్బ తగలడం.. వాంతులు, విరేచనాలు సోకుతాయి.. దీనివల్ల శరీరంలోని లవణాలు కోల్పోయి అస్వస్థతకు గురవుతారు.. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు ఘనాహారం కంటే పండ్లు, పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల వేసవి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. పండ్లలో మాంసకృతులు, పిండి పదార్థాలు విటమిన్లు మాత్రమే కాక కాల్షియం, మెగ్నీషియం, సోడియం, పొటాషియం, ఇనుములాంటి పోషకాలు ఉంటాయి... వేసవి కాలంలో లభించే పండ్లు.. వాటిలో ఉండే పోషక విలువల గురించి 'ప్రభాత సమాచారం' అందిస్తున్న కథనం.

*- ప్రభాత సమాచారం, న్యూస్ డెస్క్*

## ఆలోచన శక్తికి యాపిల్..



యాపిల్‌లో నీరూ 85.4 శాతం, కాల్షియం 0.01, పిండి పదార్థాలు 9.5 ఉంటాయి. యాపిల్‌లో ఉండే ఇనుము, భాస్వరం మెదడుకు, శరీరానికి బలాన్ని ఇస్తుంది. శరీరం నీరసంగా మారితే యాపిల్ వెంటనే శక్తిని ఇస్తుంది.

## పండ్లలో రారాజు మామిడి..



మామిడిలో పిండి పదార్థాలు 12 గ్రాములు, కాల్షియం 17, మాంసకృతులు 0.6, పాస్ఫరస్ 20, కొవ్వు పదార్థాలు 0.1, ఇనుము 0.8, విటమిన్ 'ఎ' 4,800 నుంచి 22,550 వరకు ఉంటాయి. మలబద్ధకం నివారణతో పాటు కాలేయం, పేగులు చురుకుగా పని చేస్తాయి.

## వేసవి దాహానికి బోండం..



వేసవిలో వేడిని తగ్గించడానికి కొబ్బరి బోండం ఎంతో ఉపయోగపడుతుంది. కొబ్బరి నీళ్లలో చక్కెర శాతం ఎక్కువగా ఉండడం వల్ల శరీరానికి శక్తినిస్తుంది. వేసవిలో వీటిని తాగడం మంచిది.

## దాహార్తిని తీర్చే పుచ్చకాయ..



పుచ్చకాయలు వేసవి దాహాన్ని తీర్చుతాయి. నీరు అధికశాతం ఉండడంతో పాటు కాల్షియం, ఇనుము, సల్ఫర్, కాపర్ ఎక్కువగా ఉంటాయి. రక్తహీనతను తగ్గించడంతోపాటు మలబద్ధకాన్ని కూడా దూరం చేస్తుంది. కడుపులో మంట, మూత్ర సంబంధ వ్యాధులకు మంచిది.

## ఆరోగ్యానికి ద్రాక్ష..



పండ్లలో ద్రాక్షకు ప్రత్యేకత ఉంది. దీనిలో విటమిన్లు, కాల్షియం, సోడియం, పొటాషియం, నీరు 88.5 శాతం, పాస్ఫరస్ 0.02, పిండి పదార్థాలు 10.2 ఉంటాయి. శరీరంలో నీటి శాతాన్ని పెంచి అలసట లేకుండా చేస్తుంది.

## తేలికగా జీర్ణానికి దానిమ్మ..



దానిమ్మ పండు తేలిగ్గా జీర్ణమవుతుంది. పండులో నీరు 78 శాతం, విటమిన్ సి 16 ఎంజీ, పిండి పదార్థాలు 14.5, కాల్షియం 0.01, మాంసకృతులు 1.7, పాస్ఫరస్ 0.7, ఇనుము 0.03ఎంజీ, విటమిన్ బి 10 ఎంజీ ఉంటుంది. జ్వర పీడితులకు దానిమ్మ ఎంతో మేలు చేస్తుంది.



## గ్యాస్‌ను దూరం చేసే పైనాపిల్..



పొట్టలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను దూరం చేయడంతోపాటు గుండె బలాన్ని, మూత్రం సాఫీగా ఉండేలాగా పైనాపిల్ చూస్తుంది. పేగుల్లోని క్రిములను నాశనం చేస్తుంది. పైనాపిల్‌లో నీరు 86.5 శాతం, విటమిన్ 'సి', విటమిన్ 'ఎ', విటమిన్ 'బి', చక్కెర ఉంటాయి.

## చల్లదనానికి తర్బూజా..



వేసవిలో చల్లదనాన్ని తర్బూజా ఇస్తుంది. తర్బూజాలో నీరు 95.9 శాతం, కాల్షి యం, పిండి పదార్థాలు, పాస్ఫరస్, మాంసకృతులు, ఇనుము, సోడియం ఉంటాయి. ఒంట్లో వేడిని తీసి వేయడంతో పాటు మూత్ర, చర్మ సంబంధ వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది.





# ఆ అందానికి ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే..!

యంగ్ బ్యూటీ శ్రీలీల గురించి ఎంత చెప్పినా తక్కవే. ఈ నటి తన అందంతో ఎంతో మంది మదిని దోచింది. పెళ్లిసందడి సినిమాతో తెలుగు వెండితెరపైకి అడుగు పెట్టి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. అంతే కాకుండా మొదటి సినిమాతోనే మంచి ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంది ఈ నటి. ఈ మూవీ తర్వాత శ్రీలీలకు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. ముఖ్యంగా రవితేజ ధమాక సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ సినిమాలో ఈ అమ్మడు డ్యాన్స్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. ఇక ఈ సినిమా తర్వాత శ్రీలీల గుంటూరు కారం, స్కంద, భగవంత్ కేసరి, ఎక్స్ టాఆర్డినరీ బ్యాన్ ఇలా వరస సినిమాలు చేసింది. కానీ ఈ ముద్దుగుమ్మకు అదృష్టం మాత్రం కలిసి రాలేదనే చెప్పాలి. వరసగా ఆఫర్స్ వచ్చినా అవి బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అవ్వడంతో ఒక్కసారిగా శ్రీలీల క్రేజ్ తగ్గిపోయింది. దీంతో అపకాశాలు కూడా అంతగా లేకపోవడంతో ఈ అమ్మడు కాస్త సైలెంట్ అయ్యింది. పుష్ప 2 సినిమాలో కిసక్కీ అంటూ తన డ్యాన్స్ గ్లామర్‌తో తెలుగు అభిమానులను పలకరించిన శ్రీలీల మరోసారి రాబిన్ హుడ్ మూవీ ద్వారా థియేటర్లో సందడి చేయడానికి రెడీ అయిపోయింది. అయితే తాజాగా ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న శ్రీలీల స్కైబ్లూ కలర్ చీరలో కనిపించి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఈ శారీలో ఈ ముద్దుగుమ్మ అందాలను చూస్తే ఎవ్వరైనా సరే ఫిదా అవ్వాల్సిందే. అంతలా తన గ్లామర్‌తో ఆకట్టుకుంది కిసక్కీ బ్యూటీ. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఈ ఫొటోస్ చూసిన నెటిజన్స్ నీలిరంగు చీరలో చందమామలా చాలా అందంగా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు.





# చాలా కండిషన్ పెట్టారు.. నిధి అగర్వాల్

టాలీవుడ్‌లో అందం, డ్యాన్స్, నటన ఈ మూడు కాంబినేషన్ లో ఉండే హీరోయిన్లు దొరకడం చాలా కష్టం. అలాంటి రోజుల్లో కూడా నిధి అగర్వాల్ లాంటి హీరోయిన్లు దొరుకుంటుంటారు. ఈమె అందానికి కుర్రాళ్ళు ఎలా మెంటలెక్కిపోతారో మనం సోషల్ మీడియా లో తరచూ చూస్తూనే ఉన్నాము. డ్యాన్స్ కూడా అదరగొట్టేస్తుంది. 'ఇస్మార్ట్ శంకర్' చిత్రం లో ఈమె నుండి మనం చూసిన డ్యాన్స్ కేవలం ఒక్క శాతం మాత్రమే. ఈమెకు అన్ని రకాల డ్యాన్స్ పెర్ఫార్మన్స్ ఇవ్వగలదు. అలాగే నటనలో కూడా రీసెంట్ గా ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టిన ఎంతోమంది కొత్త హీరోయిన్స్ కంటే చాలా బెటర్ అని చెప్పొచ్చు. కానీ ఈమెకు అదృష్టం కలిసి రాలేదు, పెద్ద రేంజ్ కి వెళ్లే స్థాయి ఉన్నప్పటికీ, ఇంకా మీడియం రేంజ్ హీరోయిన్ గానే మిగిలిపోయింది. ఇది కాసేపు పక్కన పెడితే, రీసెంట్ గానే ఈమె ఒక ప్రముఖ పోడ్ క్యాస్ట్‌లో పాల్గొన్నది. ఈ పాడ్ క్యాస్ట్‌లో ఆమె అనేక ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. ముఖ్యంగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కొత్తల్లో ఈమెకు ఎదురైనా అనుభవాలను పంచుకోగా అవి సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. ఈమె తొలిచిత్రం 'మున్నా మైఖేల్'. బాలీవుడ్ లో టైగర్ ష్రాఫ్ హీరోగా నటించిన ఈ సినిమా అప్పట్లో అనుకున్న స్థాయిలో ఆడలేదు. ఈ సినిమాకి అగ్రిమెంట్ చేసే ముందు నిధి అగర్వాల్ కి ఒక వింత కండీషన్ పెట్టారట. ఆమె మాట్లాడుతూ 'మేము టైగర్ ష్రాఫ్‌తో గతంలో 'మున్నా మైఖేల్' అనే చిత్రం చేశాను. ఈ సినిమాకి సంతకం చేసే ముందు కండిషన్స్ అన్ని చదివాను. అందులో ముఖ్యమైన కండీషన్ ఏమిటంటే ఈ సినిమా షూటింగ్ పూర్తి అయ్యేవరకు హీరో తో ప్రేమలో పడడం కానీ, డేటింగ్ చేయడం కానీ చేయకూడదట' అంటూ చెప్పుకొచ్చింది. 'హీరో హీరోయిన్లు నిజ జీవితంలో ప్రేమించుకుంటే షూటింగ్ మీద దృష్టి పెట్టలేరు అనే ఉద్దేశ్యంతోనే ఆ కండీషన్ ని పెట్టారట. నేను ఇప్పటి వరకు అన్ని ఇండస్ట్రీస్‌లో పని చేశాను కానీ, అగ్రిమెంట్స్‌లో ఇలాంటి షరతులు ఉండడం మాత్రం ఎప్పుడూ చూడలేదు' అంటూ నిధి అగర్వాల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి. ఇకపోతే నిధి అగర్వాల్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో 'హరి హర వీరమల్లు', ప్రభాస్‌తో 'రాజా సాబ్' వంటి చిత్రాలు చేస్తుంది. ఈ రెండు సినిమాలపై నిధి అగర్వాల్ కోటి ఆశలు పెట్టుకుంది.

# ఒక్క ఏడాదిలోనే.. ముగ్గురితో

మాస్ మాహారాజా రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. కానీ ఈ బ్యూటీ మాత్రం స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది. తెలుగులో చేసిన ఒక్క సినిమా నిరాశపరిచింది కానీ... ఈ అమ్మడు స్పీడ్ మాత్రం మాములుగా లేదు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ చూస్తుండగానే స్టార్ బ్యూటీలను వెనక్కు నెట్టేస్తోంది. ప్రస్తుతం ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టాలీవుడ్ అవుతోంది ఈ బ్యూటీ. ఫస్ట్ సినిమాతోనే యాక్టింగ్, గ్లామర్ పరంగా మంచి మార్కులే కొట్టేసిన ఈ వయ్యారి.. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ సరసన కాంత సినిమాలో నటిస్తుంది. అలాగే విజయ్ దేవరకొండ జోడిగా కింగ్ డమ్ మూవీ చేస్తుంది. ఇవే కాకుండా తెలుగులో మరిన్ని ఆఫర్స్ కొట్టేసింది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేనితో కలిసి కొత్త ప్రాజెక్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఈ ఏడాదిలోనే ఏకంగా మూడు సినిమాలో అడియన్స్ ముందుకు రానుంది ఈ వ్యయారి. కింగ్ డమ్ సినిమాలో మేలో రిలీజ్ కానుంది. రామ్ పోతినేనితో చేస్తోన్న సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే నటిస్తోన్న కాంత మూవీ ఈ ఏడాది చివర్లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే మూడు సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనుంది.



# జపాన్‌లో దేవర సెలబ్రేషన్స్‌లో ఎన్టీఆర్ సందడి

జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం దేవర. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ మూవీ రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. దేవర పార్టు 1 గతేడాది సెప్టెంబర్ 27న థియేటర్లలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై సూపర్ హిట్ టాక్ తెచ్చుకోవడమే కాకుండా దాదాపు రూ.500 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇప్పుడు ఇదే సినిమాను జపాన్‌లో విడుదల చేస్తున్నారు మేకర్స్. ఎన్టీఆర్ గత చిత్రాలకు జపాన్‌లో మంచి క్రేజ్ ఉందన్న విషయం తెలిసిందే. ఇప్పటికే అక్కడ విడుదలైన బాద్‌షాతో పాటు ఆర్‌ఆర్‌ఆర్ చిత్రాలు మంచి కలెక్షన్లు సాధించాయి. ఈ నేపథ్యంలోనే దేవర సినిమాను జపాన్‌లో మార్చి 28న గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా జపాన్‌కి వెళ్లిన ఎన్టీఆర్ దర్శకుడు కొరటాల శివ.. జపాన్ అభిమానులను కలవడంతో పాటు అక్కడి స్థానిక మీడియాలలో దేవర ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు. అయితే జపాన్ ప్రజల ప్రేమకు ఫిదా అయిన తారక్ తాజాగా వారితో ఉన్న ఒక వీడియోను ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. మీ ప్రేమతో నా మనసు నిండిపోయింది. జపనీస్ ప్రేక్షకులు మార్చి 28 నుండి సినిమా హాళ్లలో "దేపర"ని అనుభవించడానికి నేను వేచి ఉండలేను అంటూ రాసుకోచ్చాడు.



# మురుగదాస్‌ను ఎత్తుకున్న సల్మాన్, అమీర్‌ఖాన్




ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న టాప్ సెలబ్రిటీల్లో ముందు వరుసలో ఉంటారు బాలీవుడ్ స్టార్ యాక్టర్లు అమీర్ ఖాన్, సల్మాన్‌ఖాన్, కోలీవుడ్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్. ఈ ముగ్గురూ ప్రస్తుతం తమ తమ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. కాగా ఓ వైపు అమీర్‌ఖాన్ మరోవైపు సల్మాన్ ఖాన్ ఏఆర్ మురుగదాస్‌ను ఎ త్తుకొని చిరునవ్వులు చిందిస్తున్న స్టిల్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. సల్మాన్‌ఖాన్– మురుగదాస్ కాంబోలో వస్తోన్న సికిందర్. ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా మార్చి 30న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సికిందర్ ప్రమోషన్స్‌లో భాగంగా ముగ్గురూ ఇలా సందడి చేశారు. ఇప్పుడీ ఫొటో నెట్టింట ట్రెండిరగ్ అవుతోంది. తమ అభిమాన నటీనటులు, దర్శకుడిని ఒకే ఫ్రేమ్‌లో చూసిన ఫాలోవర్లు ఆనందంలో మునిగితేలుతున్నారు. సికిందర్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. కాజల్ అగర్వాల్ మరో కీ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తుండగా.. సత్యరాజ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. సమాజంలోని అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి కథ నేపథ్యంలో ఈ సినిమా రాబోతుందని ఇన్‌సైడ్ టాక్.

# మోహన్‌లాల్‌పై ముస్లింలు ఆగ్రహం..

ఇద్దరు దక్షిణాది సూపర్‌స్టార్లే. చాలామంది వాళ్లిద్దరు ఇండస్ట్రీలో ప్రత్యర్థులని పొరపడుతారు.. కాని ఇద్దరు ఆప్తమిత్రులు మమ్ముటి , మోహన్‌లాల్ ఫ్రెండ్‌షిప్ విషయంలో కొత్త వివాదం తెరపైకి వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న మమ్ముట్టి తొందరగా కోలుకోవాలని శబరిమల అయ్యప్ప అలయంలో మోహన్‌లాల్ పూజలు చేయడంపై వివాదం రాజుకుంది. శబరిమలలో మోహన్‌లాల్ పూజలు చేసిన వీడియో సామాజిక మాద్యమాల్లో వైరల్‌గా మారడంతో ఆయనపై ముస్లిం సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మమ్ముటి ముస్లిం.. ఆయన అసలు పేరు మహ్మద్ కుట్టి.. అలాంటప్పుడు ఆయన వేగంగా కోలుకోవాలని అల్లానే ప్రార్థించాలి .. కాని అయ్యప్పస్వామిని ఎలా మోహన్‌లాల్ వేడుకుంటారని కొన్ని ముస్లిం సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. శబరిమలలో మోహన్‌లాల్ ఆయన కోసం ప్రత్యేక పూజలు చేయడాన్ని తప్పుపడుతున్నాయి. వాస్తవానికి చాలామంది అభిమానులు మోహన్‌లాల్ తీరును ప్రశంసించారు. కాని కొంతమంది ఇస్లామిక్ పద్ధతులను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే తనపై విమర్శలు చేస్తున్న వాళ్ల తీరుపై మండిపడ్డారు మోహన్‌లాల్. మమ్ముట్టి తనకు ఆప్తమిత్రుడని , అలాంటప్పుడు ఆయన ఆరోగ్యం కోసం పూజలు చేస్తే ఎలా తప్పు అవుతుందని ప్రశ్నించారు. మమ్ముట్టి అనారోగ్యం నుంచి వేగంగా కోలుకుంటున్నారని తెలిపారు.. మమ్ముట్టి ఆరోగ్యంపై గత కొంతకాలంగా సంచలన వార్తలు వెలుగు లోకి వస్తున్నాయి.





## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**కుభీర్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
కుభీర్ మండలం కుప్టీ గ్రామానికి చెందిన జల్దార్కర్ శ్రీనివాస్ ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదానికి ఇంట్లో వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న మండల నాయకులు, గ్రామస్తులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.11,500 సహాయం అందజేశారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

**ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**



బిహార్ నేటి నుంచి 30 తేదీ వరకు జాతీయస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ పో టీలకు తెలంగాణ బాలికల జట్టుకు ఆదిలాబాద్ జిల్లా క్రీడాకారిణి జాబడే రితీక ఎంపికయ్యారు. జాతీ యస్థాయి టోర్నీకి రితీక ఎంపికపై జిల్లా కబడ్డీ అసోసియేషన్ చీఫ్ నగేశ్, ఛైర్మన్ పాయల్ శంకర్, అధ్యక్షుడు రఘుపతి, ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్ హర్షం వ్యక్తం చేశారు.

## ఉపాధి పనుల పరిశీలన

**లక్ష్మణచాంద, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
మండలంలోని రాచాపూర్, వడ్యాల్ గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను ఇన్చార్జి డీఆర్డీవో శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. కూలీల హాజరు, చేపట్టిన పనుల గురించి తెలుసుకున్నారు. రాచాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. యూ నిఫాంల పంపిణీ గురించి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని నర్సరీని సందర్శించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. నర్సరీల్లో షేడ్నట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని, వందశాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో రాధ, ఎంపీవో అమీర్ ఖాన్, ఏపీవో ప్రమీల, టీఏలు దినేశ్, భీమ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల వెంట మొక్కల పెంపకం

### అటవీశాఖ సీసీఎఫ్ శరవణన్

**తాంసి, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
హరితనిధిలో భాగంగా జిల్లావ్యాప్తంగా పలు రోడ్ల వెంట పచ్చదనం పెంచేందుకు మొక్కల పెంపకం చేపడుతున్నట్లు అటవీశాఖ సీసీఎఫ్ శరవణన్ తెలిపారు. తాంసి అటవీశాఖ సెక్షన్ పరిధిలో అంతరాష్ట్ర రోడ్డుకు ఇరువైపులా నాటిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవణన్ తనిఖీ చేశారు. మండలంలోని హస్నాపూర్ వద్ద నాటిన మొక్కలను డీఎస్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్తో కలిసి పరిశీలించారు. నాటిన మొక్కల వివరాలు, పెంపకం, రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. శరవణన్ మాట్లాడుతూ హరితనిధిలో భాగంగా జిల్లాలో 87 కి.మీ మేర రోడ్లు ఇరువైపులా మొక్కలు నాటినట్లు తెలిపారు. రేంజ్ ఆఫీసర్ గులాబ్, సెక్షన్ అధికారి అహ్మద్ ఖాన్,బీట్ ఆఫీసర్ సాయికుమార్ఉ న్నారు.

**నాటిన మొక్కలు ఎండిపోకుం డాచూడాలి...**
అంతర్రాష్ట్ర రహదారి ఇరువైపులా నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలని అటవీ శాఖ ఎసీసీఎఫ్ శరవణన్ అన్నారు.సుంకిడి, లింగి, కుచులాపూర్, లక్ష్మీంపూర్ గ్రామాల్లోని అంతర్రాష్ట్ర రహదారి ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు.

# ఐపీఎల్ హోరు.. బెట్టింగ్ జోరు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా దందా
- పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు పాకిన వైనం
- సరదాగా ప్రారంభమై.. వ్యసనంగా మారి..
- బంతి బంతికీ బెట్టింగే.. ఆశతో చిత్తవుతున్న యువత

**ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
క్రీడా రంగంలో ప్రస్తుతం యువత ఎక్కువగా క్రికెట్పై మక్కువ చూపుతోంది. ఆటలంటే అందరికీ అభిమానమే అయినా.. క్రికెట్ అంటే చిన్న పిల్లవాడు మొదలు.. పెద్దల వరకు మోజు లేని వారు ఉండరంటే అతిశయోక్తికాదు. ఐపీఎల్ ఇప్పుడు ఎవరి నోట విన్నా ఇదేమాట. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా అందరూ చర్చించుకుంటున్న ఆట క్రికెట్. మార్చి 22న ఐపీఎల్ ప్రారంభం కావడంతో బెట్టింగ్ రాయుళ్ల హవా మొదలైంది. ఐపీఎల్ మ్యార్లపై యువత ఆన్లైన్ బెట్టింగ్లు జోరుగా సాగిస్తున్నారు. అనుకున్న టీం గెలిస్తే.. ఒక రేటు - ప్లేయర్ సిక్స్ కొడితే ఇంకో రేటు. బాల్ బాలు పందెం ఇక సరేసరి.. ప్రతి ఓవర్ ఓవరూ బెట్టింగ్.. మొదట్లో కేవలం ఇండియా టీమ్ ఆడే మ్యార్లకు మాత్రమే ఉండేది. రాను రాను ఇది మరింత ముదిరి పాకాన పడింది. బెట్టింగ్లకు బానిసలుగా మారిన చాలా మంది అమాయకులు ఆర్థికంగా నష్టపోవడమే. కాకుండా తమ కుటుంబాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఈ మ్యాచ్లు ప్రారంభమైనప్పటి నుంచి బెట్టింగ్ జాఢ్యం ఊపందుకుంది. దీనికి తోడు అగ్నికి ఆజ్యం పోసినట్లుగా ఐపీఎల్ యువతను మరింత కట్టిపడేసింది. గతంలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ పట్టణాలకే పరిమితమయ్యుండే. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనే కాకుండా ఆయా నియోజకవర్గాలు, గ్రామాలకు సైతం ఈ క్రికెట్ బెట్టింగ్ దందా ఆన్లైన్, ఆఫ్లైన్లో పాకింది. నిత్యం వేల నుంచి రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయి. అప్పు తెచ్చి బెట్టింగ్లు పెడుతూ ఈజీ మనీకి ఆశపడి అందులోనే చిత్తవుతున్నరు. ముఖ్యంగా మంచిర్యాల, నిర్మల్ జిల్లాలో బెట్టింగ్ జోరు బాగా వినిపిస్తున్నట్లు సమాచారం.

**అంతా గప్ చుప్..**
ప్రస్తుత రోజుల్లో యువతకు అధునాతన సెల్ఫోన్లు, ల్యాప్ట్యాప్లు అందుబాటులో ఉండడంతో గుట్టచప్పుడు కాకుండా యువత ఆన్లైన్ ద్వారా బెట్టింగులకు పాల్పడుతున్నారు. క్రికెట్ బుకీలను పరిచయం చేసుకుంటున్న యువత వారి ప్రోత్సాహంతో బెట్టింగులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. కొందరు ఇంట్లోనే టీవీల ముందు కూర్చుని ఆన్లైన్లో బెట్టింగ్ పెడుతున్నారు. ఈ రోజు క్రికెట్ ఉందంటే గ్రామాల్లో కొంతమంది సీక్రెట్గా గ్రూపులుగా ఏర్పడి ఒక్కో మ్యాచ్పై వేలల్లో బెట్టింగ్ కాస్తున్నట్టు సమాచారం. మరికొందరేమో ఫోన్ల ద్వారా కూడా బెట్టింగ్ నిర్వహిస్తూ వాట్సాప్ వంటి సోషల్ మీడియా యాప్లలో సీక్రెట్ గ్రూపులు పెట్టి కూడా నడిపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, ఖాళీ ప్రదేశాల్లో గుమిగూడి బెట్టింగ్లు కడుతున్నారు.

**బెట్టింగ్ ఇలా....**
మ్యాచ్ మొదలైందంటే చాలు ప్లేయర్ బాల్ ఎన్ని పరుగులు కొడతాడు? ఓవర్లో ఎన్ని ఫోర్లు కొడతాడు?, సిక్సర్ ఎన్ని కొడితే..? ఫోర్ రన్స్ కొట్టగలడా? లేక ఈ బాలు ఔట్ అవుతాడా? అంటూ వాటిపై కాయి రాజా కాయి అంటూ పందేలు కాస్తున్నారు. మ్యాచ్ ఎవరు గెలుస్తారు. ముందు టాస్ ఎవరు గెలుస్తారు.. టాస్ పడినప్పటి నుంచి బాల్ బాల్కు పందెం కాస్తున్నట్లు సమాచారం. రకరకాలుగా బెట్టింగ్లు కాస్తూ.. ఆ జట్టు గెలిస్తే వెయ్యి.. ఓడితే రెండింతలు, మూడింతలు పెడుతున్నారు.

**రూ. వెయ్యి మొదలు రూ. లక్షల్లో...**
బెట్టింగ్ రాయుళ్లు ప్రధాన టీంలకు ఒక రేటు, మామూలు జట్లకు మరో రేటు ఫిక్స్ చేస్తారు. రూ.వెయ్యికి రూ.2వేలు, రూ.2వేలకు రూ.4వేల చొప్పున పందెం వేస్తున్నారు. వెయ్యి నుంచి రూ.10వేల వరకూ బెట్టింగ్లు జరుగుతున్నాయి. యువత ఇష్టాన్ని.. బెట్టింగ్ సంస్కృతిని ఆసరా చేసుకుంటున్న కొందరు క్రికెట్తో వ్యాపారం చేస్తున్నారు. కమీషన్లు తీసుకుంటూ బుకీలుగా మారుతున్నారు. రెండువర్గాల మధ్య మధ్యవర్తిత్వం చేసి అందినకాడికి దండుకుంటున్నారు. అదే సమయంలో మందు పార్టీలు సైతం చేసు కుంటూ తాగిన మైకంలో బెట్టింగ్లపై మోజు పెంచుకుంటున్నారు. సిటీ ప్రాంతాలలో ఈ వ్యవహారం రూ.లక్షల్లో సాగుతున్నాయి.



**అప్పులు తెచ్చి మరీ బెట్టింగ్...**
పేద, మధ్య తరగతి వాళ్లకు ఈజీ మనీ ఆశ చూపి బెట్టింగ్ ఊబీలోకి దింపుతున్నారు. అప్పులు చేసి మరీ బెట్టింగ్ కట్టే వాళ్లు కొందరైతే, మరికొందరు డబ్బులు లేకుంటే ఖాళీ ప్రామిసరీ నోట్స్పై సంతకం లేదా బైక్స్, మొబైల్స్ పెట్టుకుని డబ్బులను ఇస్తున్నారు. సంబంధిత అధికారులు క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## కఠిన చర్యలు తప్పవు...



ఐపీఎల్లో బెట్టింగ్లకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నిర్వాహకులపై కేసు నమోదు చేస్తాం. ఎవరైనా బెట్టింగులకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. యువత బెట్టింగ్ల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. పట్టుబడితే గేమింగ్ యాక్ట్ ద్వారా కేసులు నమోదు చేస్తాం. యువత బెట్టింగ్లకు అలవాటు పడకుండా జీవిత ఆశయాలపై దృష్టి సారించాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఏం చేస్తున్నారనే విషయాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. అన్ని స్టేషన్ల పోలీస్ అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

**-ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

# 315 కిలోల నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత



**మందమర్రి, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
315 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. మందమర్రి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ శశిధర్ రెడ్డితో కలిసి ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఇటీవల దేవాపూర్ పీఎస్లో నమోదైన నకిలీ పత్తినాల కేసులో గుడిమల్ల చంద్రయ్య, కూనారపు బాలకృష్ణ, మహమ్మద్ సాహెబ్ జానీ, ముల్కల్ల సుధీర్, గోవిందుల శంకర్ను అదుపులో తీసుకున్నారు. అదే కేసులో మరో నిందితుడు అబ్దుల్ రజాక్ పరారీలో ఉన్నాడు. పోలీసులు ప్రత్యేక టీమ్లుగా ఏర్పడి గాలించగా బుధవారం మందమర్రిలో పట్టుబడ్డాడు. అతన్ని విచారించగా గుజరాత్ రాష్ట్రం నుంచి నకిలీ పత్తి విత్తనాలు తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు తెలిపాడు. పట్టణానికి చెందిన కాశిపాక తిరుపతి సహాయంతో పొన్నారానికి చెందిన బొలిశెట్టి జనార్ధన్కు విక్రయించినట్లు ఒప్పుకున్నాడు. వారు అందించిన సమాచారంతో దేవాపూర్లోని చింతగూడ సల్పల వాగు పక్కన దాచిన 315 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. వీటి విలువ రూ.7,87,500 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. కాసిపేట ఏవో ప్రభాకర్ రెడ్డి సమక్షంలో పంచనామా నిర్వహించి అబ్దుల్ రజాక్, కాశిపాక తిరుపతి, బొలిశెట్టి జనార్ధన్లపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో మందమర్రి ఎస్సై రాజశేఖర్, దేవాపూర్ ఎస్సై అంజనేయులు పాల్గొన్నారు.

## రుణాల రికవరీలో 'ఆదర్శం'

**మందమర్రి, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
రుణాల రికవరీలో ఆదర్శంగా నిలిచిన మందమర్రి నేత్రనిధికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కింది. మందమర్రి మున్సిపాలిటీలో నేత్రనిధి ఆధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.5 కోట్ల రుణాలు మంజూరు చేయడమే కాకుండా 98 శాతం రికవరీ చేసి రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచింది. బుధవారం ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరి యమ్ (గచ్చిబౌలి)లో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, సీత్రనిధి మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ చేతుల మీదుగా మందమర్రి మెప్మా టీఎంసీ రఘురాం, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు మౌనిక, అసిస్టెంట్ మేనేజర్ మమత అవార్డు అందుకున్నారు.

## ఇఫ్తార్ విందుకు రూ.1లక్ష చెక్కు అందజేత

**ముథోల్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ప్రభుత్వ పరంగా నిర్వచించే ఇఫ్తార్ విందుకు రూ.1లక్ష చెక్కును బుధవారం మజీద్ నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నారాయణ రావు పాటిల్, సరస్వతి, సిబ్బంది రవికుమార్, మజీద్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



## నేడు షబ్-ఏ-ఖదర్

### ఖురాన్ అవతరణ దినం - మహోత్తరమైన రాత్రిగా గుర్తింపు

**ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
రంజాన్ మాసంలో ఇస్లాం చరిత్రలోనే ముఖ్యమైన రాత్రి. ఈ మాసం ప్రారంభమై గురువారానికి 26వ రోజున అల్లా అంతిమ దైవగ్రంథం దివ్య ఖురాన్ అవతరించింది. దీన్ని షబ్-ఏ-ఖదర్ పిలుస్తారు. ఈ గ్రంథం మార్గనిర్దేశం చేస్తుందని నెన్నెల జామా మసీదు మౌలానా షగీర్ అహ్మద్ బర్కద్వా చెప్పారు. ఖురాన్ సన్మార్గ బాటలో పయనించడానికి ఉపకరిస్తుందని వివరించారు. ఖురాన్ పఠనం చేసిన వారి సంఖ్య భారీగా ఉండటం దైవ సంకల్పానికి నిదర్శమన్నారు. పదేళ్ల వయస్సు చిన్నారులు దీన్ని పఠించడం విశేషమన్నారు. చరిత్ర పుటల్లో ఏ పుస్తకాలను తిరగేసినా కాలానుగుణంగా మార్పు చెందుతాయని, అదే ఖురాన్ అవతరించి సుమారు 1450 ఏళ్లు దాటుతున్నా అక్షరం కూడా మార్పు చెందలేదన్నారు. ఖురాన్లో 30 ఫారాలు (పాఠాలు), 114 సూరాలు, 6666. వ్యాఖ్యలు ఉన్నాయని చెప్పారు.

## ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

**బెల్లంపల్లి, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని జామా మసీదులో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముచ్చర్ల మల్లయ్య, నయీమ్, నిజాముద్దీన్లు రంజాన్ తోఫాను పంపణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# స్త్రీ నిధిలో బెస్ట్.. ఉమ్మడి జిల్లాకు రుణాల రికవరీలో రాష్ట్రస్థాయి పురస్కారాలు





## వరుసగా నాలుగోసారి అవార్డు కైవసం చేసుకున్న నిర్మల్ జిల్లా - రుణాల రికవరీలో ఆదర్శం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా

### మంత్రి చేతుల మీదుగా స్వీకరించిన అదనపు కలెక్టర్

**ఆసిఫాబాద్ :** స్త్రీనిధి రుణాల రికవరీలో ఆదర్శంగా నిలిచిన జిల్లాకు అరుదైన గౌర వం దక్కింది. 2023 -24 ఆర్థిక సంవత్సరంలో 94 శాతం రుణాల రికవరీతో రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రత్యేక పురస్కారానికి ఎంపికై ఉంది. హైదరాబాద్లోని గచ్చిబౌలిలో బుధవారం నిర్వహించిన సీ త్రనిధి 12వ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్, సీత్రనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి చేతుల మీదుగా అదనపు కలెక్టర్ దీపక్ తివారి రాష్ట్రస్థాయి పురస్కారం అందుకున్నారు. మంత్రి మాట్లాడుతూ జిల్లాలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, మహిళా సాధికారతపై అదనపు కలెక్టర్ దీపక్ తివారి చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. సీనిధి ఆర్ఎం శ్రీనివాస్, మెప్మా హెడ్ మోతీరాం, సిబ్బంది పాల్గొన్నారు.



**నిర్మల్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
స్త్రీనిధిలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే రెండవ స్థానంలో నిలిచింది. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా రాష్ట్ర స్థాయిలో వరుసగా అవార్డులను కైవసం చేసుకుంటోంది. తాజాగా ఈ సంవత్సరం కూడా ఆ ఘనతను నిలుపుకుంది. బుధవారం స్త్రీనిధి 12వ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర గ్రామీణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను, శ్రీనిధి రుణాల వసూలు 88 శాతం, క్రెడిట్ ప్లాన్ అచీవ్మెంట్లో 105 శాతం లక్ష్యాలను సాధించి ఉత్తమంగా నిలిచినందుకుగాను రాష్ట్రంలోనే రెండవ స్థానం అవార్డు లభించింది. లోకేశ్వరం మండలం ప్రగతి మండల సమాఖ్యకు ఉత్తమ మండల సమాఖ్యగా రాష్ట్రంలో రెండవ స్థానం దక్కింది. కాగా జిల్లాకు వరుసగా నాలుగో సంవత్సరం అవార్డు లభించింది. ఈ అవార్డులను డీఆర్డీఓ తరపున జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, ప్రగతి మండల సమాఖ్య అధ్యక్షురాలు సాగర, ఎపిఎం మల్లేష్లు రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డి.అనసూయ సీతక్క, చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అభినందించారు.

# బాసర ట్రిపుల్ ఐటీకి ఇన్చార్జ్ వీసీకి అరుదైన గౌరవం



**ముథోల్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో విధులు నిర్వహిస్తున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్కు బిజినెస్ టాక్ట్ మ్యాగజైన్ అరుదైన గౌరవం దక్కింది. తాజా ఎడిషన్ -140ని వెల్లడించగా.. అందులో భారతదేశ భవిష్యత్తు రూపొందించడంలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణ, వ్యవస్థాపకత ప్రాముఖ్యతపై ప్రొఫెసర్ గోవర్ధన్ ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధనక్కు ఓఎస్టీ ప్రొఫెసర్ మురళీధరన్, ఏవో రణధీర్, అసోసియేట్ డీన్స్ డాక్టర్ విఠల్, విభాగాల అధిపతులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

**అధ్యాపకులతో వీసీ సమీక్ష...**
ఆర్జీయూకేటీ అధ్యాపకులతో ఇన్చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అధ్యక్షతన బుధ వారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి వీసీ మాట్లాడుతూ నాక్ అక్రిడిటేషన్తో నాణ్యమైన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇన్స్టిట్యూషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ (ఐయూఏసీ), సెల్ఫ్ స్టడీ రిపోర్ట్స్ (ఎస్ఎస్ఆర్), వర్క్షాప్లు, సెమినార్లు, సమావేశాలు, అధ్యాపక విజయాలు, ప్రాజెక్ట్ వర్కును సమన్వయం చేయాలన్నారు. టెక్ ఫెస్ట్, స్పోర్ట్స్ డే, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంలో అధ్యాపకులు, కన్వీనర్లు సహకారం అందించారన్నారు. సమావేశంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీ దర్శన్, ఎవో రణధీర్, అసోసియేట్ డీన్లు తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న
ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి
జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా
సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్చార్జీలు,
మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

# విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి



### కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీ చిత్తరంజన్

**ఆసిఫాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నా రు. సీఐ సత్యనారాయణ, ఎస్సై గుంపుల విజయ్తో కలిసి బుధవారం మండలంలోని లెండిగూడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల కు పరీక్ష ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు, పెన్నులు అందించారు. బిలివర్స్ అకాడమీ జీకే మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అ నంతరం గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా సంప్రదించాల ని సూచించారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు క్రాంతికుమార్ ఉన్నారు.

**దుకాణాల్లో తనిఖీలు...**
తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని కెరమెరి మండలం భోలాపటార్ గ్రామంలో గల దుకాణాలను బుధవారం ఏఎస్పీ చిత్తరంజన్ తనిఖీ చేశారు. 56 దేశీదారు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. లెండిగూడలో మహిళా సంఘాలు మద్య నిషేధం అమలు చేస్తుండగా, గ్రామస్తులు భోలాపటార్కు వెళ్లి మద్యం తాగుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



**ఆసిఫాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా తిర్యాణి మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో బుధవారం కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి విద్య, వైద్యం, సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 20 గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతిగృహా ల్లో శుద్ధమైన తాగునీరందించేందుకు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలన్నారు. అవసరమై న అనుమతులు పొందాలని ఆదేశించారు. అలాగే యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఆసిఫాబాద్ పట్టణ సమీపంలో ఏర్పాటు చే సేందుకు స్థలం గుర్తించాలని సూచించారు. ఆరు మినీ అంగన్వాడీ మోడల్ భవన నిర్మాణ పనులు చేపట్టాలని, ఎంపిక చేసిన ఆరు పాఠశాలల్లో మరమ్మతులు, అదనపు తరగతి గదులు నిర్మించాలన్నారు. తిర్యాణి మండలంలో పాఠశాలలు, రైతువేదికలు, ప్రాథమి క ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాల్లో డిజిటల్ ఇంప్రూవ్మెంట్లో భాగంగా కంప్యూటర్లు, ప్రింటర్లు సమకూర్చాలన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో సీపీవో కోటయ్య, డీటీడీవో రమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, డీఎంహెచ్ సీతారాం పాల్గొన్నారు.

# గాంధీపార్క్ టెండర్ రూ.37.39లక్షలు

**ఆదిలాబాద్, మార్చి 26 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కుకు గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సారి భారీగా ఆదాయం సమకూరింది. 2025-26 సంవత్సరానికి గాను పార్కు నిర్వహణ కోసం మున్సిపల్ అధికారులు ఈ నెల 22 నుంచి టెండర్లను ఆహ్వానించారు. బుధవారం టెండర్ దాఖలుకు తుది గడువు కాగా మొత్తం ఆన్లైన్లో రెండు, ఆఫ్లైన్లో ఐదు దాఖలయ్యాయి. సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలోని ఎంఈ చాంబర్లో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ కార్తీక్ ఆధ్వర్యంలో ఈ టెండర్లను ఖరారు చేశారు. రూ.18,21,600 ధరతో టెండర్లను పిలువగా అత్యధికంగా పట్టణానికి చెందిన టి.ప్రశాంత్ రూ.37లక్షల 39వేలకు టెండర్ దాఖలు చేసి పార్కు నిర్వహణను దక్కించుకున్నాడు. టెండర్ వివరాలతో కూడిన నివేది కను కలెక్టర్కు పంపించి, వారి ఆదేశాల మే రకు కొత్త కాంట్రాక్టర్కు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని డీఈ తెలిపారు. బల్దియా టెక్నికల్ ఆఫీసర్ మమత పాల్గొన్నారు.